
ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 14 డిసెంబరు 2024

ప్లాన్డ్‌గా.. ఫోకస్

- అంశాల వారీగా కలెక్టర్లకు దిశానిర్దేశం
- రెండు రోజుల సదస్సులో సూచనలు, ఆదేశాలు
- టిడ్కో ఇళ్లపై దృష్టి పెట్టాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇసుక అక్రమ తవ్వకాలు, బ్లాక్‌మార్కెటింగ్‌ని అరికట్టాలి..
- 132 ఎన్టీఆర్ టౌన్‌షిప్‌లు, మరో 5 అన్న క్యాంటీన్లకు ప్రతిపాదనలు
- పీజీఆర్ఎస్‌లో గుంటూరు, బాపట్ల, పల్నాడు ర్యాంక్‌లు మెరుగుపడాలని సూచన

టిడ్కో సముదాయాల్లో పెండింగ్ పనులు, లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ.. సులభ తరంగా, భారం కాకుండా, అందరికీ ఇసుక అందాలి.. రోడ్ల మరమ్మతులు.. ఎన్టీఆర్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు.. మరిన్ని అన్న క్యాంటిన్లకు ప్రతిపాదనలు.. సంతృప్తి కరంగా ప్రజా సమస్యల పరిష్కారాలు.. రెవెన్యూ సదస్సులు.. ఇలా జిల్లాల ప్రాతి పదికగా ఆయా అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్లకు ముఖ్య మంత్రి చంద్రబాబుతో పాటు విభాగాధి పతులు దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల పాటు రాజధాని అమరావతి సచి వాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సు శుక్రవారం రాత్రితో ముగిసింది. ఈ సదస్సులో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. అభివృద్ధి.. పాలన.. ప్రజా సమస్యలు.. ఇలా అన్నింటి పైనా కలెక్టర్లకు పలు సూచనలతో పాటు ఆదేశాలు కూడా జారీ చేశారు. ఆయా అంశాల్లో సేవలు నాణ్యంగా, వేగంగా, ప్రజలు సంతృప్తి చెందేలా ఉండాలని.. అందుకు ప్రణాళికాబద్ధంగా దృష్టి సారించా లని కలెక్టర్లకు సదస్సు దిశానిర్దేశం చేసింది. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి తీసుకుంటున్న అభిప్రాయాలను కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించింది. మాతృభాషలోనే ఆదేశాలు ఇవ్వాలని, సిబ్బందికి తరచుగా ఫిర్యాదుల పరిష్కారంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి నాణ్యమైన సేవలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పీజీఆర్ఎస్‌లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ర్యాంకింగ్ మెరు గుపడాలని ప్రభుత్వం ఆదే శాలు జారీ చేసింది. మూడు జిల్లాల కలెక్టర్లు ప్రతీ సోమవారం జరిగే పీజీఆర్ఎస్, గ్రామసభ లు, కొద్ది రోజుల నుంచి జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న ఫిర్యాదులను విశ్లేషించుకోవాలని సూచించింది. ఇప్పటికే పూర్తయిన టిడ్కో ఇళ్లను పేదలకు అందించడం, మిగిలిన ఇళ్లను త్వరి తగతిన పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకో వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, బ్లాక్‌మార్కెటింగ్‌ని పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు నగర, పట్టణవాసులకు ఇళ్లు నిర్మించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రెండు రోజులుగా జరిగిన కలెక్టర్ల సమావేశంలో గణాంకాలు అదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.



పట్టణ పేదలకు ఇళ్లు ఇవ్వాలి

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేయాలని ప్రభుత్వం రెండు రోజుల సదస్సులో కలెక్టర్లకు సూచించింది. మౌలిక వసతుల కల్పనతో పాటు రుణాల మంజూరుపై కూడా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. 2014- 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు గేటెడ్ కమ్యూనిటీ స్థాయిలో టిడ్కో గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2019 నాటికి అవి 90 శాతం పూర్తయినా గత వైసీపీ ప్రభుత్వం వాటిని పేదలకు ఇవ్వకుండా నిలిపివేసింది. గుంటూరు జిల్లాలో 5 పురపాలక సంఘాల్లో 15 చోట్ల 18,448 వేల ఇళ్లను నిర్మించ తలపెట్టగా వాటిలో ఇప్పటికి 16,048 వేల ఇళ్లు పూర్తయ్యాయి. 9,472 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యాయి. 2,592 మందికి రుణాలు మంజూరు కావాల్సి ఉంది. పూర్తయిన 16,048 ఇళ్లను పురపాలక సంఘాలకు అప్పగించగా వాటిలో 9,120 ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన పూర్తయింది. వాటిలో 7,398 ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు. కాగా పల్నాడు జిల్లాలో 6 పురపాలక సంఘాల్లో 7 చోట్ల 12,512 ఇళ్లు నిర్మించ తలపెట్టగా 6,016 వేలు పూర్తయ్యాయి. 2,934 మందికి రుణాలు మంజూరుకాగా, 3,082 మందికి రుణాలు మంజూరు కావాల్సి ఉంది. కాగా పూర్తయిన 6,016 ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన కూడా పూర్తయింది. వాటిలో 1,152 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయగా మిగిలిన ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో రెండు పురపాలక సంఘాల్లో 2,304 ఇళ్లను నిర్మించ తలపెట్టగా ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. అయితే 166 మందికి రుణాలు మంజూరయ్యాయి. మరో 794 మందికి రుణాలు మంజూరు కావాల్సి ఉంది.

స్మార్ట్ టౌన్‌షిప్‌లకు కార్యాచరణ

గుంటూరు జల్లాలో 132 ఎకరాల్లో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ తీసుకుంది. ఒక్కో అసెంబ్లీ నియో జకవర్గంలో ఒక్కో లేఅవుట్ ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే విభజిత గుంటూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో భూమిని గుర్తించాల్సి ఉండగా ఇప్పటికే 4 నియోజకవర్గాల్లో భూమిని గుర్తించారు. రెండు నియోజకవర్గాల్లో భూమిని సేకరించారు. ఒక నియోజకవర్గంలో ప్రాజెక్టును లాంచ్ చేశారు. కాగా పల్నాడు, బాపట్ల జిల్లాలో 13 నియోజకవర్గాల్లో భూములను గుర్తించగా,

(మిగతా 8వ పేజీలో..)

ఫిర్యాదులను సమీక్షించాలి

గుంటూరు, డిసెంబ రు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ర్యాంకింగ్ మెరుగుప డాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడా ది జూన్ 15 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం లో జిల్లా ల వారీగా ర్యాంకు లను ప్రక టించింది. అందులో బాపట్ల 15, గుంటూరు 17, పల్నాడు 20వ ర్యాంకులలో నిలిచాయి. బాపట్లలో 2234 వస్తే 1376(61.59 శాతం), గుంటూరులో 1730కి 1010(58.138 శాతం), పల్నాడులో 1720కి 983(57.15 శాతం) అర్జీలు పరిష్కారమయ్యా యి. పీజీఆర్ఎస్‌లో వస్తున్న ఫిర్యాదులను వేగంగా, సమర్థంగా పరిష్కరించేందుకు కలెక్టర్లు దృష్టి సారించాలి. ఇందుకోసం కీలకమైన అంశాలను గుర్తించి వాటిని ఏ విధంగా తగ్గించాలనే దానిపై క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గదర్శకం చేయాలని సదస్సు సూచించింది. వెబ్‌ల్యాండ్‌ని ఆర్ఎస్ఆర్‌తో పునః పరిశీలించి ప్రభుత్వ భూములేమైనా పట్టా భూములుగా మార్చారో, లేదో చూడాలి. అలానే విచారణ జరిపి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. రికార్డులను భద్రపరిచేందుకు రెవెన్యూ కార్యాలయాల్లో వాచ్‌మన్లను పోస్టింగ్ చేయాలి. నెలలో కలెక్టర్లు ఈ విషయంలో సర్టిఫై చేయాలి. కలెక్టర్లు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి. అన్ని చట్టాలు సక్రమంగా అమలు చేయాలి. సీనియర్ సిటిజన్స్, ప్రజలకు ప్రాధాన్యం ఇవ్వాలి. భూములకు సంబంధించిన అంశాల్లో పరిశీలనతో పాటు చర్యలు ఉండాలి. రీసర్వేపై నిర్వహిస్తున్న గ్రామసభలకు సంబంధించి పల్నాడులో 135 జరిగాయి. అక్కడ 3378 ఫిర్యాదులు రాగా 1309 పరిష్కరించారు. పరిష్కార శాతం 38.75గా ఉన్నది. బాపట్లలో 66 సభలు నిర్వహించగా 4253

(మిగతా 8వ పేజీలో..)

ఇసుక సులభంగా అందాలి

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నూతన విధానం ప్రకారం ఇసుక ప్రజలకు సులభతరంగా అందాలి. ఉచిత ఇసుక పుష్కలంగా అందుబాటులో ఉంచడమే కాకుండా భరించదగ్గ చార్జీలతో రవాణా చేసుకోగలిగేలా ఉండాలి. ఈ విషయంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు దృష్టి పెట్టాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ అధికారులు కలెక్టర్ల సదస్సులో సూచించారు. రాష్ట్రం దాటి అనధికారికంగా ఇసుక, ఇతర ఖనిజాలు రవాణా జరగకుండా చూడాలని ఆదేశించారు. అక్రమ మైనింగ్‌ని అరికట్టి ప్రభుత్వానికి ఖనిజ సంపద రూపంలో ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. మైనింగ్ లీజు దరఖాస్తుదారులు, లెటర్ ఆఫ్ ఇండెంట్ హోల్డర్స్‌కు ఎన్‌వోసీలు, ఇతర అనుమతులు వేగవంతంగా వచ్చేలా చూడాలని, వినియోగంలో లేని లీజులను తిరిగి గనుల తవ్వకాలు ప్రారంభించాలన్నారు. ఇదే సమయంలో నిఘాని పటిష్టం చేసుకుని సహజ వనరులను కాపాడాలని ఆదేశించారు. ప్రస్తుతం గుంటూరులో నాలుగు ఇసుక రీచ్‌లకు మూడింటిలో తవ్వకాలు జరుగుతున్నాయి. ఒక దాంట్లో వరదనీరు ప్రవహిస్తున్నది. పల్నాడు జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లకు రెండు మాత్రమే వినియోగంలో ఉండగా నాలుగింటిలో వరదనీరు చేరింది. బాపట్లలో రెండు రీచ్‌లకు ఒకటి నిర్వహణలో ఉండగా మరొకటి వరదనీరు ప్రవాహం కారణంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో వరదనీరు తగ్గిపోగానే వెనువెంటనే వాటిల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభించేలా చూడాలని కలెక్టర్లకు

(మిగతా 8వ పేజీలో..)



ఎయిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- 17న ఎయిమ్స్ స్నాతకోత్సవానికి హాజరుకానున్న ముర్ము
- ఎయిమ్స్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష.. ఏర్పాట్లపై సూచనలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపదిముర్ము మంగళగిరి పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం విస్తృతఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 17న జరగనున్న ఎయిమ్స్ ఆస్పత్రి ప్రథమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఎయిమ్స్ ఆడిటోరియాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎయిమ్స్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతితోపాటు రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఎయిమ్స్ స్నాతకోత్సవానికి హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లుచేయాలని సూచించారు. పటిష్టభద్రత, వాహనాల పార్కింగ్, సైన్‌బోర్డుల ఏర్పాటు, ప్రాంగణం సుందరీకరణ, బారికేడింగ్, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాలపై చర్చించారు. రాష్ట్రపతి విజయవాడ నుంచి ఎయిమ్స్‌కు రోడ్డు మార్గాన వస్తున్న నేపథ్యంలో రహదారుల సుందరీకరణ, పారిశుధ్యం, హోర్డింగ్‌లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో కేటాయించిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మదబానందకర్, అకడమిక్ డీన్ శ్రీమంతకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ నటరాజ్, జేసీ ఎ.భార్గవతేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా, డీసీహెచ్ మయానామజీదాబి, ఆర్అండ్‌బీ ఈఈ విశ్వనాథ్‌రెడ్డి, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో కే.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి, డీఎస్‌వో పీ.కోమలి పద్మ, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ జీ.లక్ష్మి పాల్గొన్నారు.

8
డెంగీలో గుంటూరు డేంజర్ జోన్
గత ఏడాది 334 ...
ఈ ఏడాది 424 కేసులు

నరసరావుపేట మార్గంలో శబరిమల రైళ్లు

అంతమొందిస్తానని వైసీపీ నాయకుడు బెదిరిస్తున్నాడు 6
- రక్షణ కల్పించాలని మంత్రి లోకేశ్‌కి ఓబులమ్మ వినతి
- 51వ రోజు ప్రజాదర్బార్‌లో అర్జీల వెల్లువ

800 గ్రాముల గంజాయి స్వాధీనం
- దుగ్గిరాలలో పోలీసుల అదుపులో నిందితుడు

పశుపోషణకు.. ప్రోత్సాహం

- పోషకులకు ప్రభుత్వం చేయూత
- విస్తృతంగా మినీ గోకులం షెడ్లు మంజూరు
- జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు
- మూడు జిల్లాల్లో 1836 షెడ్లకు 76 నిర్మాణం పూర్తి
- స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం

షెడ్ల మంజూరు

జిల్లా	మంజూరు	పురోగతిలో	పూర్తి
పల్నాడు	698	558	26
గుంటూరు	373	291	21
బాపట్ల	765	684	29

గోకులం.. రాయితీ ఇలా..

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
2 గేదలు	1,15,000	1,03,500	11,500
4 ఉంటే..	1,85,000	1,66,500	18,500
6కి మించి..	230,000	2,07,500	23,000
20 గొర్రెలు, మేకలు	1,31,000	91,000	39,000
50 దాటితే..	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు ఉంటే	87,000	60,900	26,100
200కి పైగా..	1,32,000	92,000	39,600

(నరస రావుపేట, ఆంధ్రజ్యోతి) పశుపోషణ.. పాడి పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. పశు, పాడి పోషకులను ప్రోత్సహించేందు కు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం 2018లో మినీ గోకులం పథకాన్ని ప్రవేశపెట్టి పశుపో షకులను ప్రోత్సహించింది. అదే పథకాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి ప్రవేశపెట్టింది. దీంతో విస్తృతంగా మినీ గోకులం నిర్మాణాల ను చేపట్టింది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమ లు చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు మం జూరయ్యాయి. గేదలు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థికం గా చేయూత అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు 1,836 షెడ్లను మంజూరు చేశారు. ఇందుకు సంబంధించి పశుసంవర్ధక శాఖ లబ్ధి దారులను ఎంపి క చేసింది. షెడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 76 షెడ్ల నిర్మాణం పూర్తి అయినట్లు పశుసంవర్ధక శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. షెడ్ల నిర్మాణం లో పశు పోషకులకు 90శాతం, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం మేర రాయితీ కల్పించింది. గోకులం షెడ్లకు లబ్ధిదారుడు 10శాతం చెల్లిస్తే 90శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులు వారి వాటా ధనం మొత్తంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం ఇస్తుంది. తొలి విడతలో మండలానికి 25 యూనిట్లు మంజూరు చేశారు. సొంత స్థలం ఉన్న చిన్న, సన్న కారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.



గోకులం పథకం కింద నిర్మించిన షెడ్



ఏకగ్రీవాలయ్యేనా?

- నీటి సంఘాలపై కూటమి కసరత్తు
- నేడు ఎన్నిక.. ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- 2,628 టీసీలు.. 274 నీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోని సాగు నీటి సంఘాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ క్రమంలో ఇప్పటికి రెండు సార్లు ఎన్నికలు వాయిదా పడగా ఎట్టకేలకు శనివారం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సాగునీటి సంఘాల్లో తొలుత టీసీలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించాయి. గ్రామాల్లో ముఖ్యంగా రైతులకు సంబంధించిన ఈ ఎన్నికలను సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా చేసుకునేందుకు అటు రైతులు, ఇటు గ్రామ స్థాయి నాయకులు మంతనాలు జరుపుతున్నారు. మొత్తం మీద సాగు నీటి సంఘాల ఎన్నికల సందడి పల్లెల్లో నెలకొంది. శనివారం సాయంత్రం కల్లా ఎన్నికలు పూర్తి కానున్నాయి. వైసీపీ మద్దతుదారులు వారికి బలం ఉన్న సంఘాల్లో పోటీకి సమాయత్తమయ్యారు. కూటమి, వైసీపీ మద్దతుదారులైన రైతులు పోటీ చేసే నీటి సంఘాల్లో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. సేవా భావం కలిగిన వారిని నీటి సంఘాలకు ఎన్నుకోవాలని ఎమ్మెల్యేలు రైతులకు పిలుపునిచ్చారు. ఏకగ్రీవంగా ఎన్నిక జరిగేలా రైతులను కూటమి నేతలు కోరుతున్నారు. కూటమిలో బీజేపీ, జనసేన మద్దతుదారులకు సంఘాలను కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నీటి సంఘాల వారీగా కూటమి తరఫున పోటీ చేసే రైతుల జాబితాలను సిద్ధం చేశారు. ఏ సంఘానికి ఎవరు పోటీ చేయాలో నిర్ణయించి సదరు రైతులకు సమాచారం ఇచ్చారు. వారు పోటీకి కావాల్సిన పత్రాలను సిద్ధం చేసుకున్నారు. ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం అన్ని కమిటీలకు సంబంధించి ప్రాదేశిక సభ్యులకు ఎన్నిక జరగనున్నది. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకునే ఆనవాయితీ ఉంది. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగు నీటి సంఘాలు(డబ్ల్యుయూఏ) ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

17న డీసీలకు ఎన్నికలు

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలోని లింగంగుంట్ల జలవనరుల సర్కిల్ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు జరగనున్నాయి. ఆయా ఎన్నికలకు సంబంధించి కూడా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డీసీ పదవులకు కూటమిలో పోటీ తీవ్రంగా ఉంది. డీసీలకు ఎన్నికైన వారు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవికి టీడీపీ సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు.



వేమూరులో నీటి సంఘాల ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్ సుశీల



ఆక్వా రంగంలో కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి



ప్రసంగిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

పెదకాకాని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగంలో వచ్చే వ్యాధులను గుర్తించే విధంగా కొత్త ఆవిష్కరణలు చేయాలని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలోని ఈ అండ్ ఐటీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంబడెడ్ సిస్టమ్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్‌లో వాటి పాత్ర అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సులో రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీని వ్యవసాయ, ఆక్వా రంగంలో కూడా విస్తరింప చేయాలని, మనిషి అవసరం లేకుండా వ్యవసాయ స్థితిగతులు తెలుసుకునే విధంగా ఆవిష్కరణలు రావాలని సూచించారు. అమరావతిలోని విట్ ప్రొఫెసర్ అమిత్ చవాన్ మాట్లాడుతూ ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇతర విభాగాలైన ఐఓటీ, కృత్రిమ మేధస్సు, హెచ్‌ఎమ్‌ఐలతో కలిపి వినియోగించవచ్చునని పేర్కొన్నారు. ఇది భవిష్యత్తులో స్మార్ట్ గాడ్జెట్స్ తయారు చేసేందుకు వీలుగా ఉంటుందని వివరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, ఇన్‌చార్జి ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ మాట్లాడుతూ ఇన్స్ట్రుమెంట్ అవసరం అన్ని రంగాల్లో ఉందన్నారు. ఫీజిటెక్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రమణ తేజ వెనిగళ్ళ, విశిష్ట ఇన్నోవేటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సాధు సాయి సందీప్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఉపయోగించే ఫ్లోమీటర్స్ ఇన్స్ట్రుమెంట్ తయారు చేయడానికి ఎంబెడెడ్ సిస్టం ఉపయోగపడుతుందన్నారు. సదస్సుకు విభాగాధిపతి ఆచార్య సంధ్యకోల్ అధ్యక్షత వహించారు. అధ్యాపకులు డాక్టర్ షర్మిల, కల్యాణి, రవిచంద్ర పాల్గొన్నారు.

అంతమొందిస్తానని వైసీపీ నాయకుడు బెదిరిస్తున్నాడు

- రక్షణ కల్పించాలని మంత్రి లోకేశ్‌కి ఓబులమ్మ వినతి
- 51వ రోజు ప్రజాదర్బార్‌లో అర్జీల వెల్లువ



వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

తాడేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు శుక్రవారం అర్జీదారులు రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చి వివిధ సమస్యలపై అర్జీలు అందించారు. పెన్షన్ మంజూరు చేయాలని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, కబ్జాదారుల నుంచి భూములు రక్షించాలని విన్నవించగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. వేధింపులతో తన కుమారుడి ఆత్మహత్యకు కారణమైన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని సత్యసాయి జిల్లా బుక్కపట్నానికి చెందిన ఎం.ఓబులమ్మ మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టగా, ఉపసంహరించుకోని పక్షంలో కుటుంబ సభ్యులను అంతమొందిస్తామంటూ వైసీపీ నాయకుడు ఇ.రామ్మోహన్ బెదిరిస్తున్నారని చెప్పారు. తమకు ప్రాణభయం ఉందని రక్షణ కల్పించాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ నుంచి శాశ్వతంగా వచ్చిన మున్నూరు కాపులకు బీసీ-డి కింద కులధ్రువీకరణ పత్రం జారీలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 20 ఏళ్లుగా విజయవాడలో నివసిస్తూ ఏపీ ఎస్‌టీసీఎల్ కార్పొరేషన్‌లో హమాలీలుగా పని చేస్తున్నామనీ, అర్హత ఉన్నప్పటికీ కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలలో నష్టపోతున్నాయని మంత్రికి వివరించారు. మున్నూరు కాపులకు బీసీ-డి కింద కులధ్రువీకరణ పత్రాల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గెజిట్‌లో పొందుపరిచినప్పటికీ అధికారులు నిరాకరిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.5 లక్షలు తీసుకుని మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం గోపాలపురంకు చెందిన ఓర్సు జగదీష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కోవిడ్ సోకిన తన తండ్రికి వైద్య ఖర్చుల కోసం ఉన్న భూమిని విక్రయించి ఆయన్ను బతికించుకున్నామని, ఏ ఆధారం లేని తనకు తిరువూరు మండలం చౌటుపల్లికి చెందిన కె.ప్రసాద్ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించడంతో అప్పు చేసి రూ. 5 లక్షలు చెల్లించానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని విశాఖకు చెందిన టి రాము విజ్ఞప్తి చేశారు. గత 15 ఏళ్లుగా ఆంధ్రా యూనివర్సిటీలో దివ్యాంగులకు సంబంధించి 80కి పైగా బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, భర్తీ చేసి దివ్యాంగులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో భర్తీ చేయనున్న కంప్యూటర్ ఆపరేటర్స్, కంప్యూటర్ టీచర్స్ ఉద్యోగాలలో గతంలో పని చేసిన ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఇవ్వాలని కంప్యూటర్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గం ఆత్మకూరు పరిధిలోని జగనన్న కాలనీకి బైపాస్ కనెక్టివిటీ రోడ్డు నిర్మాణంతోపాటు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కాలనీ వాసులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పలువురు దివ్యాంగులు వీల్‌చైర్‌లో వచ్చి తమ సమస్యలను మంత్రి లోకేశ్‌కు విన్నవించగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అన్నదాతల ఊసెత్తే అర్హత వైసీపీకి లేదు

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్లపాటు వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారు. రైతుల్ని బలిపీఠంపైకి ఎక్కించారు. అప్పుల రైతు ఆత్మహత్యల్లో దేశంలోనే ఏపీని నంబర్ వన్‌గా నిలిపారు. ఇంత చేసిన వైసీపీకి ఇప్పుడు అన్నదాతల ఊసెత్త అర్హత లేదు' అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అన్నదాతకు అండగా వైసీపీ అంటూ ఆ పార్టీ పిలుపునిచ్చిన ఆందోళనలకు పల్నాడుతో సహా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో నడుస్తుంది రైతు సంక్షేమ ప్రభుత్వమనీ, జూన్ 4 నుంచి అన్నదాతలు ఆ మార్పును కళ్లారా చూస్తున్నారని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగుభారమై, అప్పుల ఊబిలో చిక్కుకుపోయిన వారందర్నీ గట్టెక్కించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. రైతులపై రుణభారం తప్పించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి కావాల్సిన అన్ని చర్యలను ఈ ఐదేళ్లలో ప్రజా ప్రభుత్వం తీసుకోనుందన్నారు. ఉన్నతాధికారులంతా కార్యాలయాలు వదిలి పొలాలకు వెళ్లి అన్నదాతల ఇబ్బందులు తెలుసుకోవాలని చంద్రబాబునాయుడు సూచించారన్నారు. రానున్న రోజుల్లో సాగునీరు, విత్తనాలు, ఎరువులు, పరపతి సాయం మొదలు ప్రతి దశలో రైతులకు నిజమైన చేయూత అందించేలా సీఎం ఆలోచనలు చేస్తున్నారని తెలిపారు. అన్నింటికంటే కీలకమైన పంటల బీమా విషయంలో స్వల్ప వ్యవధిలోనే ఆయన నిర్ణయం తీసుకున్నారన్నారు. 2019కి ముందు విధానంలోనే రైతుల భాగస్వామ్యంతో పంటల బీమా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారని తెలిపారు.

రేపు పొదిల బ్లాక్‌పై అదనపు అంతస్తుల నిర్మాణానికి శ్రీకారం

గుంటూరు మెడికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని పొదిల ప్రసాద్ జింకానా సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో మరో రెండు ఫ్లోర్‌ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. డిసెంబర్ 15న రెండు అదనపు అంతస్తుల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, ఎన్నారై డాక్టర్ పొదిల ప్రసాద్, జింకానా బిల్డింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సాగిరెడ్డి బాబురెడ్డితో పాటు డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో డాక్టర్ మంజుల డీ హోసమణి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తదితరులు పాల్గొంటారు. ఈ అంతస్తుల్లో సూపర్ స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటు చేయనున్నారు.

800 గ్రాముల గంజాయి స్వాధీనం

దుగ్గిరాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో తొలిసారిగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి విక్రయాలు దుగ్గిరాల మండలంలోనా అంటూ ప్రజలు అవాక్కయ్యేలా మండల కేంద్రం దుగ్గిరాల గ్రామ శివారులోని ఈమని లాకుల వద్ద 800 గ్రాముల గంజాయిని ఎస్సై వెంకటరవి శుక్రవారం పట్టుకున్నారు. చిలువూరుకు చెందిన ఇద్దరు, దుగ్గిరాలకు చెందిన మరొకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మరికొందరిని కూడా త్వరలో అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిసింది. మంగళగిరి నియోజకవర్గంలో గంజాయి ఆనవాళ్లు లేకుండా సమూలంగా నిర్మూలించాలని అధికారులకు ఆదేశాలున్న నేపథ్యంలో పోలీసులు ఆపరేషన్ డెకాయ్‌తో గంజాయి విక్రయిస్తున్న యువకులను పట్టుకున్నారు. గంజాయి బ్రాండ్‌ను బట్టి కిలో రూ.8 వేల నుంచి రూ. 50 వేల వరకూ పలుకుతుందని నిందితులు చెప్పడం గమనార్హం. చిలువూరులో రెండు నెలల క్రితం జరిగిన గొడవల్లోనూ గతంలో గంజాయి విక్రయించిన వారు ఉండటంతో విషయాన్ని ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు ఆపరేషన్ ప్రారంభించి నిందితులను పట్టుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలతో వ్యవసాయ రసాయనాల అభివృద్ధి



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆచార్య అనీస్ టిల్లీ

గుంటూరు(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పురుగు మందులు, గడ్డి నిర్మూలన ఉత్పత్తుల్లో ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు ఉండటం వలన ఎక్కువ కాలం నిల్వ ఉండే సామర్థ్యాన్ని పొందటంతో పాటు వ్యవసాయ రసాయనాల అభివృద్ధి జరుగుతుందని ఫ్రాన్స్ లయోన్‌లోని క్లాడే బెర్నార్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనీస్ టిల్లీ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ మూడు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ సెమినార్‌ను శుక్రవారం ఘనంగా ముగించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ అనీస్ టిల్లీ మాట్లాడుతూ ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు ఔషధ పరిశ్రమ, వ్యవసాయ రసాయనాలు, మెటీరియల్స్ సైన్స్ వంటి అనేక రంగాల్లో ప్రధాన పాత్రను పోషిస్తాయన్నారు. ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు ఔషధాల్లో సమర్థవంతమైన జీవక్రియాపరమైన లక్షణాలను అందిస్తాయన్నారు. మరో ముఖ్యఅతిథి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమ్మేళనాలు తయారికే కాకుండా మరెన్నో రసాయన, బయోటెక్నాలజీ, మెడిసిన్, యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ రంగాల్లో విస్తృతంగా ఉపయోగపడుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి డిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.వెంకటేశు సెమినార్‌లో భాగంగా ప్రదర్శించిన పోస్టర్‌లలో మొదటి బహుమతి రోహిత్ ఫణీంద్ర బండారు, రెండో బహుమతి అంజిత, మూడో బహుమతి భవ్యకు అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట భూములను జగనన్న కాలనీలుగా మార్చారు



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో పచ్చని పంట భూములను జగనన్న కాలనీలుగా మార్చారనీ, ఒక్క పంట కాలువ పూడిక తీసిన దాఖలాలు లేవనీ, అన్నదాతలు క్రాప్‌హాలీడేస్ ప్రకటించిన విషయం మరిచారా అంటూ వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఉద్దేశించి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో గాదె వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో రైతుల ప్రభుత్వం అంటూ ప్రచారం చేయడం తప్ప మేలు చేసిందే లేదని ఆరోపించారు. పంటల సాగుకు రైతాంగానికి నీరు అందించే కాలువలను సైతం పట్టించుకోకపోవడంతో అవి పూడి పోయాయని అన్నారు. సాగునీటి కోసం రైతులు ధర్నాలు, నిరసనలు చేసినా కనికరించని ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని ధ్వజమెత్తారు. చివరి గింజ వరకూ కొంటామంటూ గోతాల నుంచి తరుగు వరకూ రైతులను నిలువు దోపిడీ చేసిన దగాకోరు ప్రభుత్వం వైసీపీయేనని తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతాంగానికి మంచి చేసేలా పాలన చేస్తుందన్నారు. సకాలంలో పంట కాలువలు పూడికలు తీయించడంతో సాగునీటికి ఎక్కడా సమస్య ఏర్పడలేదన్నారు. పంటలు కూడా సకాలంలో చేతి కొచ్చి రైతాంగానికి గిట్టుబాటు ధరలతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. నేరుగా రైతుల ఖాతాలోనే నగదు జమ చేస్తుండటంతో ఇది మంచి ప్రభుత్వమని రైతు కుటుంబాలు అభినందిస్తున్నాయన్నారు. ఇకనైనా ప్రభుత్వంపై బురదజల్లే విధానాన్ని మానుకోకుంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో తోటకూర వెంకటరమణారావు, బండారు రవికాంత్, షేక్ ఇస్మాయిల్, హరిదాసు గౌరిశంకర్, ఎం.సుబ్రహ్మణ్యం, తోట నాగేంద్రం, హరికృష్ణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

49,486 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 42,677 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,486 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 36,575 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15000	334	7500	14000
నెంబరు. 5	8000	14500	నెంబరు.5	8500	10500
273	--	--	273	11500	11500
341	8000	14500	341	8500	14000
4884	10000	14000	4884	--	--
సూపర్ 10	12000	12000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	16500	తేజ	7500	16500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	7500	13000
దేవనూరు డీలక్స్	9700	16000	దేవనూరు డీలక్స్	10000	13000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4500	10000

కేసు దర్యాప్తుపై నిర్ణయం తీసుకునేందుకు సమయం కావాలి

- హైకోర్టును అభ్యర్థించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్
- మేరుగు క్వాష్ పిటిషన్‌పై విచారణ జనవరి 21కి వాయిదా

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం ఆరోపణలతో మాజీ మంత్రి, వైసీపీ నేత మేరుగు నాగార్జునపై నమోదైన కేసు విషయంలో మేజిస్ట్రేట్ రికార్డు చేసిన ఫిర్యాదుదారు స్టేట్‌మెంట్‌ను పోలీసులు హైకోర్టుకు నివేదించారు. బాధితురాలికి మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక తెప్పించుకున్నట్లు పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ వివరించారు. అన్ని విషయాలను పరిశీలించి కేసు విషయంలో దర్యాప్తును కొనసాగించాలా? లేదా అనే దానిపై పోలీసులు నిర్ణయం తీసుకుంటారన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ క్వాష్ పిటిషన్‌పై విచారణను జనవరి 21కి వాయిదా వేశారు. ఉద్యోగం, కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తామని ఆశచూపి తన వద్ద నుంచి డబ్బులు తీసుకోవడమే కాకుండా శారీరకంగా వాడుకున్నారని ఆరోపిస్తూ విజయవాడకు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు జిల్లా, తాడేపల్లి పోలీసులు మాజీ మంత్రి, వైసీపీ నేత మేరుగు నాగార్జున, మురళీమోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వారు ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు ఇటీవల విచారణకు వచ్చింది. కోర్టు ముందు హాజరైన బాధిత మహిళతో న్యాయమూర్తి నేరుగా మాట్లాడారు. పిటిషనర్లు మేరుగు నాగార్జున, మురళీమోహన్‌రెడ్డి తనపై అత్యాచారానికి పాల్పడలేదనీ, రాజకీయ ఒత్తిడి కారణంగా తప్పుడు కేసు పెట్టానని మహిళ సమాధానం ఇచ్చారు. వారిపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని అభ్యర్థించారు. ఈ విషయంలో ప్రమాణ పత్రం కూడా దాఖలు చేశానని వివరించారు. న్యాయమూర్తి స్పందిస్తూ అత్యాచారం జరగలేదనీ, తప్పుడు ఫిర్యాదు చేశానంటూ ఫిర్యాదుదారు(బాధిత మహిళ) ప్రమాణ పూర్వక అఫిడవిట్ దాఖలు చేసిన నేపథ్యంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే మేరుగు నాగార్జునపై నమోదైన అత్యాచారం కేసులో దర్యాప్తును కొనసాగిస్తారా? లేదా? అనే వివరాలను రాతపూర్వకంగా కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో...

పానుగంటి చైతన్యకు బెయిల్

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో కీలక నిందితుడైన వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యకు బెయిల్ మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం బెయిల్ మంజూరు చేస్తూ మెజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు జారీ చేశారు. 2021 అక్టోబరు 19న మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ గుండాల మూక దాడికి పాల్పడి విధ్వంసం సృష్టించింది. వైసీపీ అధికారంలో ఉండడంతో అప్పట్లో పోలీసులు నామమాత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యాలయంపై దాడి కేసును విచారించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించింది. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి సీఐతోపాటు మరో ముగ్గురు ఎస్‌ఐలను సస్పెండ్ చేశారు. కేసు విచారణ ప్రారంభించిన మంగళగిరి రూరల్ పోలీసులు 116 మందికి పైగా నిందితులు ఉన్నట్లు గుర్తించారు. వారిలో కొందరిని అరెస్టు చేయగా అత్యధిక మంది అరెస్టు నుంచి రక్షణ కోరుతూ కోర్టులను ఆశ్రయించారు. కొందరికి ఇప్పటికే అరెస్టు నుంచి రక్షణ లభించగా, మిగిలిన వారి పిటిషన్‌లు ఆయా కోర్టులలో విచారణలో ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ఈ కేసులో కీలక నిందితుడైన పానుగంటి చైతన్య అజ్ఞాతంలోకి వెళ్లారు. సుమారు ఐదు నెలల పాటు అజ్ఞాతంలో ఉన్నారు. అరెస్టు భయంతో గత అక్టోబర్ 14న కోర్టులో లొంగిపోయారు. దీంతో ఆయన్ను రిమాండ్‌కు కోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి చైతన్య గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి ప్రధాన అనుచరుడైన చైతన్య అప్పిరెడ్డి ఆదేశాలతో గుంటూరు నగరం నుంచి పెద్ద సంఖ్యలో రౌడీషీటర్లు, మాజీ రౌడీషీటర్లు, కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, స్థానిక యువకులను సమీకరించి టీడీపీ కార్యాలయంపై దాడికి నేతృత్వం వహించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కేసులో అత్యంత కీలకమైన నిందితుడిగా ఉన్న చైతన్యకు బెయిల్ మంజూరు కావడానికి రెండు నెలల సమయం పట్టింది.

ఎరువులు, పురుగు మందుల షాపులపై విజిలెన్స్ దాడులు

- రూ. 9.60 లక్షల ఫెర్టిలైజర్స్ స్వాధీనం

గుంటూరు సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల జిల్లాలోని ఎరువుల షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. గుంటూరు విజిలెన్స్ ఎస్పీ డి.సూర్యశ్రావణ్ కుమార్ నేతృత్వంలో ఈ దాడులు నిర్వహించారు. దాడుల్లో ప్రత్తిపాడు శ్రీమంజునాథ ట్రేడర్స్, పయనీర్ ఆగ్రోస్‌లో రికార్డ్స్ సక్రమంగా నిర్వహించకుండా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. ఆయా షాపుల్లో స్టాక్‌లో వ్యత్యాసములు ఉన్నందున 22.86 టన్నుల ఎరువులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయించారు. బాపట్ల జిల్లా చీరాలలోని శ్రీఅన్నపూర్ణ ఫెర్టిలైజర్, సుభాష్ జనరల్ స్టోర్, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఫెర్టిలైజర్ నుంచి 52.65 మెట్రిక్ టన్నుల ఎరువులు స్వాధీన చేసుకుని కేసు నమోదు చేశారు. మొత్తం రూ.9.60 లక్షల విలువ చేసే ఎరువులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏవో ఆదినారాయణ, సీఐలు చంద్రశేఖర్, శివాజీ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అనేక ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుంటూరు టౌన్-1 ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి 21 వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలు

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పొదుపు వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ కేవీఎల్ఎనల్ మూర్తి తెలిపారు. ఇంధన పొదుపుపై ప్రజల్లో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపడతామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులలో విద్యుత్ పొదుపుపై అవగాహన పెంపొందించుటకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వివిధ కార్యక్రమాలు అమల్లోకి తెచ్చినట్లు చెప్పారు. అవగాహన కార్యక్రమాల నిర్వహణకు వివిధ స్థాయిల్లో ఉన్న విద్యుత్ అధికారుల నుండి, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎమ్) సిబ్బంది వరకూ ప్రతి ఒక్కరికీ ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. 19న గుంటూరు కలెక్టరేట్ నుండి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎస్ఈ వివరించారు. స్వచ్ఛందంగా విద్యుత్ వినియోగ దారులు, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ రంగా లకు సంబంధించిన వాలంటీర్లు పాల్గొని ర్యాలీని విజయవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు - ముఖ్యాంశాలు

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై క్రమ శిక్షణా చర్యలు - వాటిలో ముఖ్యాంశాలను పెన్షన్ దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య వివరించారు. సస్పెన్షన్ ఉత్తర్వులు తొలగించే అధికారం ప్రభుత్వానికి, సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన అధికారి.పై అధికారికి మాత్రమే ఉందన్నారు. క్రిమినల్ చార్జీలపై అరెస్టై సస్పెండయినా, బెయిల్ మంజూరైనప్పటికీ సర్వీసులోరీ ఇన్‌స్టేట్ చేయాల్సిన పని లేదన్నారు. తాత్కాలిక నియామకమైన ఉద్యోగిని సస్పెండ్ చేసిన బదులు సర్వీసు డిశ్చార్జి చేయవచ్చన్నారు. సరైన కారణాలు లేకుండా సస్పెండ్ చేస్తే దానికి బాధ్యుడైన అధికారిపై క్రమశిక్షణా చర్యలు చేపట్ట వచ్చన్నారు. లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడితే ఏసీబీ ప్రాథమిక రిపోర్టు ఆధారంగా ఆ ఉద్యోగిని సస్పెండ్ చేయవచ్చన్నారు. అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని వెంటనే సస్పెండ్ చేయాల్సిన పనిలేదన్నారు. క్రమశిక్షణా కేసులు పెండింగ్‌లో ఉండగా ఉద్యోగుల యొక్క ఫ్యామిలీ బెనిఫిట్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్ , ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్‌ల నుంచి ఎటువంటి రికవరీ చేయరాదన్నారు. ఆదాయ పన్ను, వృత్తి పన్ను, కోర్టు ఎటాచ్‌మెంట్‌లు, ఇంటి రుణం, ప్రభుత్వ క్వార్టర్‌ల వసతికి లైసెన్స్ ఫీజులు, సస్పెండైన ఉద్యోగి సబ్‌సిస్టెన్స్ అలవెన్సు నుంచి రికవరీ చేయవచ్చని వీరయ్య కోరారు.

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా విజన్-2047: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్-2047 రూపొందించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. విజయవాడలో జరిగిన స్వర్ణాంధ్ర- 2047 బహిరంగ సభకు శుక్రవారం స్థానిక చుట్టుగుంట సెంటర్ నుంచి పశ్చిమ నియోజకవర్గ ప్రజలు భారీ సంఖ్యలో వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బస్సులకు ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర శాశ్వతమైన అభివృద్ధికి, సుసంపన్నమైన భవిష్యత్తుకు విప్లవాత్మక స్వర్ణాంధ్ర ప్రణాళిక ఒక దిశా నిర్దేశం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కురంగి శ్రీను, ఆళ్ళ హరి, కదరి సంజయ్, శివ, బాబ్జి, ఆంజనేయులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మినీ బస్సులు నడపండి

గుంటూరు నగరంలో ఆర్టీసీ మినీ బస్సులను సిటీ సర్వీసులుగా నడపాలని ఎమ్మెల్యే మాధవి ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రవికాంత్‌ను కోరారు. గుంటూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ఆయనతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా గుంటూరులో పట్టణ జనాభా వేగంగా పెరుగుతోందని, ప్రత్యేకించి సంపత్‌నగర్, శ్రీనివాసరావుపేట, మిర్చి యార్డు ప్రాంతాలు నగరపాలక సంస్థలో విలీనమై వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. పలకలూరు రోడ్డు, ఎస్వీఎన్ కాలనీ విద్యా సంస్థల కేంద్రంగా ఉందని,స్వర్ణభారతీనగర్ ప్రాంత వాసులు పనుల నిమిత్తం తరచుగా నగరానికి వస్తుం టారని ఆయా రూట్లలో మినీ బస్సులు నడపాలని కోరారు.

వక్రీకరణ వార్త అమానుషం

ధర్మ పరిరక్షణ కోసం నిలిచే కుటుంబం తమదని, తనపై వక్రీకరణలతో కూడిన తప్పుడు వార్తలు ప్రసారం చేయడం అమానుషమని ఎమ్మెల్యే మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఛానెల్‌లో తనపై ప్రసారమైన వక్రీకరణ వార్త నేపథ్యంలో శుక్రవారం ఆమె తన క్యాంపు కార్యా లయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరులో శుక్రవారం జరిగిన ఘటనను ఆసరా చేసుకుని ఓ న్యూస్ ఛానెల్‌లో తన పేరుపై ఒక అసత్య వార్తను ప్రసారం చేయడం భావ్యం కాదని అన్నారు. తాను హిందూ మతానికి వ్యతిరేకంగా ప్రవర్తించినట్లు ప్రసారం చేయడం తగదని అన్నారు. ఈ ఘటన గురించి ఆమె ప్రస్తావిస్తూ, రద్దీగా ఉండే కూడళ్ళలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద కొంతమంది వ్యక్తులు నిలబడి వాహనాలను ఆపడం, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడం గమనించి వారికి ప్రత్యామ్నాయం సూచించినట్లు చెప్పారు. పవిత్ర భగవద్గీతను ఇలా రోడ్డుపై విక్రయించడం చూసి ఆవేదన చెంది "మీరు ఎందుకు ఇలా రోడ్డు మీద భగవద్గీతను తీసుకొచ్చి విక్రయిస్తు న్నారు, మీకు ఒక స్టాల్‌ను నేను ఏర్పాటు చేస్తాను" అని చెప్పి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ఆ పుస్తకాలను విక్రయించాలని వారికి చెప్పానని అన్నారు. ఓ ఛానెల్‌లో ఉద్దేశపూర్వకంగా తనపై 30 సెకన్ల నిడివి ఉన్న ఓ వీడియోను కట్ చేసి ప్రచారం చేశారని, దానిని మతపరమైన సమస్యగా సృష్టించారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తన మొదటి నెల జీతంలో కొంత భాగాన్ని ఇస్కాన్ ప్రతినిధులకు, అక్షయపాత్రకు అందించిన విషయం కూడా ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. తమది ధార్మిక కుటుంబమనీ, తాము కొన్ని గుడులు కట్టించామని, కార్తీక దీపోత్సవాలు, సంక్రాంతి సంబరాలు, అయ్యప్ప పడి పూజ కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించారు. ధర్మ పరిరక్షణ కోసం కట్టుబడి ఉన్నానని, ప్రజలు ఇటువంటి ప్రచారాలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.



బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు

కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవంలో నిర్వహించిన పోటీలలో పాల్గొన్న తమ విద్యార్థులు బహుమతులు సాధించారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్ర బుక్ హౌస్ నిర్వహించిన 'కథ చెబుతాను ఊ కొడతారా' పోటీలో ఎస్.కె. అఫీఫా మొదటి బహుమతి, ఆర్.వినూత్నదర్శిని ద్వితీయ బహుమతి, వెరోనిక జీవన్ తృతీయ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. 'నేను చదివిన మంచి పుస్తకం' అంశంపై నిర్వహిం చిన పోటీలో ఏ మోక్ష మొదటి బహుమతి, కే హిమ వెంకట నాగశ్రీ ద్వితీయ బహుమతి, జే లక్ష్మీ హారిక తృతీయ బహుమతి, అభ్యుదయగీతాలు పోటీలో ఆర్. వినూత్న దర్శిని మొదటి బహుమతి, టీ ఉత్తేజ్‌రెడ్డి తృతీయ బహుమతి, హిమ నాగశ్రీ ప్రత్యేక బహుమతి గెలుచుకుంది. శతక పద్య పఠనం పోటీలో ఆర్. వినూత్న దర్శిని మొదటి బహుమతి, ఎస్.కె.ఆరీనా ద్వితీయ బహుమతి, డీ చరణ్‌శ్రీ తృతీయ బహుమతి, బీ లికేష్ ప్రత్యేక బహుమతి, క్విజ్ పోటీలో అఫీఫా, రోహిత, ఆయాన్ ముజామిల్ మొదటి బహుమతి, టీ ఉత్తేజ్‌రెడ్డి, డీ రేష్మ, బీ శ్రీనిత్య, తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఆర్. వినూత్న దర్శిని, కె.హరిణి, సీహెచ్ రోశయ్య ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ అభినందించారు.



డిఆర్‌వో ఖాజావలిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న నేతలు అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి, ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు తదితరులు

రైతు సమస్యలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నష్టాల ఊబిలో ఉన్న రైతులను, వారి సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసి చోద్యం చూస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. 'అన్నదాతకు అండగా వైసీపీ' పేరుతో గుంటూరు కలెక్టరేట్ ఎదుట వైసీపీ నేతలు శుక్రవారం నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా రైతు భరోసా కేంద్రాలతో రైతులకు అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలిచామన్నారు. రైతు భరోసా కింద తమ ప్రభుత్వం రైతులకు రూ. 13 వేలు అందజేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక తాము రైతులకు రూ. 20వేలు అందజేస్తామంటూ రైతులను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా రూ. 20 వేలు రైతులకు ఇస్తామన్న హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్‌ఓ ఖాజావలిని కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు కొందరు నాయకులు, కార్యకర్తలు మెయిన్ గేటు ఎదుట దూసుకెళుతుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్యనేతలను మాత్రమే లోనికి అనుమతించారు. వైసీపీ నేతలు తలపెట్టిన నిరసన కార్యక్రమం పేలవంగా జరిగిందన్న విమర్శలు ఆ పార్టీ ముఖ్య నేతల నుంచి వ్యక్తమైంది.నిరసన కార్యక్రమానికి రైతుల నుంచి ఆ పార్టీ కార్యకర్తల నుంచి కూడా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. నిరసన కార్యక్రమానికి వైసీపీ ముఖ్య నాయకులు, అరకొర నాయకులు మాత్రమే హాజరయ్యారు. నిరసనలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు నూరిఫాతిమా (గుంటూరుతూర్పు), డైమండ్ బాబు (తాడికొండ), బలసాని కిరణ్ కుమార్ (ప్రత్తిపాడు), అన్నాబత్తుని శివకుమార్ (తెనాలి), అంబటి మురళీ (పొన్నూరు), దొంతిరెడ్డి వేమారెడ్డి (మంగళగిరి) పాల్గొన్నారు.

డైమండ్స్ షో ప్రారంభం

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో శుక్రవారం డైమండ్స్ షోను ప్రారంభించారు. డైమండ్స్ షోని ముఖ్య అతిధులుగా డాక్టర్ శిల్ప సింధూర కడియాల, వ్యాపారవేత్త పెద్ది రమణారావు లాంచనంగా ప్రారంభించారు. ఈ డైమండ్స్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, మగ వారు నచ్చే, మెచ్చే ఆభరణాలు, ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 17వ తేదీ వరకు ఈ డైమండ్స్ షో నిర్వహించనున్నట్లు షోరూం హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ సిహెచ్ గోపికిరణ్‌లు తెలిపారు. డైమండ్ షో లో భాగంగా వజ్రాభరణాల కొనుగోలు పై వజ్రాల విలువలో 25% వరకు తగ్గింపు పొందవచ్చన్నారు. పాత వజ్రాభరణాల ఎక్స్ఛేంజ్ పై 100 శాతం విలువను పొందవచ్చన్నారు. ఈ ఆఫర్లు 2025 జనవరి 12 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు.



డైమండ్ షోను ప్రారంభిస్తున్న శిల్ప సింధూర, రమణరావు తదితరులు



సేవకు సంకెళ్లు



- నాడు గాంధీజీ శంకుస్థాపన చేసిన వినయాశ్రమం.. నేడు నిరుపయోగం
- 'ధర్మశాసనం'కు తూట్లు.. తెరుచుకోని గేట్లు

వినయాశ్రమం.. త్యాగమూర్తుల ఫలం. నిస్వార్ధసేవలకు నిలువుటద్దం. ఇదంతా గతం. మరి, ప్రస్తుత పరిస్థితి.. అందుకు భిన్నంగా ఉంది. ట్రస్ట్ బోర్డు వివాదంతో సేవకు సంకెళ్లు ఏర్పడి, ఆధిపత్యపోరుకు చిరునామాగా మారింది. వినయాశ్రమం సేవలు రైతులకు అందని ద్రాక్ష అయ్యాయి. వినయాశ్రమం 'ధర్మశాసనం' నీరుగారిపోతోంది.

రేపల్లె,డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం కల్యాణ కావూరు వినయాశ్రమం అంటే.. నాడు జాతిపిత మహాత్మాగాంధీ నడయాడిన నేల. ఒకప్పుడు నిస్వార్థ స్వాతంత్ర్య సమరయోధులను తయారు చేసిన కర్మాగారం ఇది. సుమారు 75 ఏళ్ళ పాటు కొనసాగిన ఈ వినాయాశ్రమంలో ప్రస్తుతం స్వార్థం తాండవించింది. వాటి తలుపులు మూతపడి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. రైతులకు సేవలందించే కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) నిరుపయోగంగా మారింది.

'బాపూజీ బాగ్'

స్వాతంత్రోద్యమం ఊపందుకున్న సమయంలో గాంధీ దేశమంతా తిరిగి చేసిన ప్రసంగాలకు కల్యాణ కావూరుకు చెందిన గొల్లపూడి సీతారామశాస్త్రి(స్వామి సీతారాం) ఆ ప్రసంగాలకు ఆకర్షితులయ్యారు. బారిష్టర్ వృత్తికి స్వస్తిచెప్పి స్వాతంత్రోద్యమంలో ఆయన పాలుపంచుకున్నారు. స్వామి సీతారాం కావూరు శివారు భూమిలో 1932 నవంబరు 10న తోట వేసి 'బాపూజీ బాగ్'గా నామకరణం చేశారు. స్వామిసీతారాం పిలుపు మేరకు కావూరుకి చెందిన తుమ్మల బసవయ్య దుర్గాంబలు తమ యావదాస్తితో పాటు (బంగారు మంగళసూత్రం మినహా) సర్వం అర్పించి తమ నిస్వార్థతను చాటుకున్నారు. ఆశ్రమ నిర్మాణానికి స్వామి సీతారాం నడుం బిగించారు.

'ధర్మశాసనం' నిబంధనలు

ధర్మశాసనం నిబంధనల ప్రకారం సభ్యుడిగా చేరే వ్యక్తి తన యావదాస్తిని ఆశ్రమానికి రాసి, ఒక సంవత్సరం ఆశ్రమ జీవనం గడిపిన తర్వాత మాత్రమే సభ్యత్వం పొందే అవకాశం ఉంటుంది. అహింసా మార్గంలో పయనిస్తూ మద్యం, మాంసాహారాలను విడనాడి 21 ఏళ్లు పైబడిన వారు మండలిలో సభ్యులుగా చేరవచ్చు. ఒకవేళ ధర్మకర్తల మండలిలో సభ్యులు ఎవరూ లేకపోతే బాధ్యతలు నిర్వహిస్తున్న ధర్మకర్త తన మరణశాసనం ద్వారా యోగ్యుడైన వ్యక్తిని నియమించవచ్చు.

'వినయాశ్రమం'గా నామకరణం

గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షుడు జాగర్లమూడి పిట్టు స్వామి చౌదరి కావూరులో తనకు ఉన్న 25.50 ఎకరాల భూమిని సంవత్సరానికి రూ.300 చొప్పున 99 సంవత్సరాలు కౌలు తీసుకున్నట్లు 1933 నవంబరు 25న స్వామి సీతారాం శాస్త్రి పేరున రాశారు. 1933 డిసెంబరు 23న కల్యాణకావూరును సందర్శించిన గాంధీ దానికి 'వినయాశ్రమం' అని నామకరణం చేసి శంకుస్థాపన చేశారు. స్వామిసీతారాం శాస్త్రి తనకు ఉన్న ఎకరం భూమి, వెండి ఆకు, చెంబు ఆశ్రమానికి విరాళంగా ఇచ్చారు. ఆనాడు వినయాశ్రమానికి ఒక ధర్మశాసనం చేశారు. స్వామిసీతారం, తుమ్మల బసవయ్య, దుర్గాంబల ఆధీనంలో ఏడు శాశ్వత నిబంధనలు, 25 సామాన్య నియమాలతో ధర్మశాసనాన్ని రూపొందించారు. ఆ ధర్మశాసనాన్ని 1951 డిసెంబరు 21న చెరుకుపల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిష్టర్ చేయించారు.



ఆధిపత్యపోరు..

కేవీకే చైర్మన్‌గా తుమ్మల దుర్గాంబ అనంతరం పావులూరి రాజగోపాల్‌నాయుడు చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఆ తర్వాత 1995లో బీ భుజంగరావును ధర్మకర్తగా నియమించారు. అనంతరం 2000లో గోగినేని నాగేశ్వరరావుకు మేనేజింగ్ ట్రస్టీ బాధ్యతలను అప్పచెప్పారు. 2008 వరకు ఆయన కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాలు కొనసాగిస్తూ రైతులకు సేవలందించారు. 2008లో ట్రస్టీ బోర్డు నుంచి ఆయన దిగిపోవడంతో జాగర్లమూడి నరేంద్రనాథ్, తుమ్మల తులసీదాస్‌ల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. పాలకమండలి రెండువర్గాలుగా చీలిపోయింది. బాపూజీ శంకుస్థాపన చేసిన వినయాశ్రమంలో ఇరువర్గాలు దాడులకు తెగబడి ఆ ప్రాంతాన్ని రక్తసిక్తం చేశారు. సుమారు 75 ఏళ్ళ పాటు కొనసాగిన ఈ ఆశ్రమంలో స్వార్థం తాండవించి వినయాశ్రమం తలుపులు మూతపడటంతో రైతులకు సేవలందించే కేవీకే మసకబారిపోయింది.





ట్రస్ట్ గొడవలు.. స్తంభించిన కార్యకలాపాలు

నేటి వరకు మేనేజింగ్ ట్రస్ట్ గొడవలు తేలకపోవడంతో కేవీకేలో రోజూవారీ పనులు సాగక పరిపాలనా కార్యకలాపాలు స్తంభించాయి. సిబ్బందికి జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. ఆనాటి త్యాగమూర్తులు రూపొందించిన ధర్మశాసనానికి తూట్లు పొడిచారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం అయినా ఈ విషయమై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఎన్‌జీ రంగా కృషి విజ్ఞానకేంద్రం

వినాయాశ్రమం పేరిట ఉన్న 110 ఎకరాల్లో 50 ఎకరాలను ఎన్‌జీ రంగా కృషి విజ్ఞాన కేంద్రానికి కేటాయించి.. 1992లో వినయాశ్రమం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) స్థాపించారు. రైతులకు కేవీకే అనేక సూచనలు, సలహాలు అందిస్తూ సేంద్రీయ ఎరువుల తయారీ, నూతన వరివంగడాల తయారీ, తెనే. పట్టు పరిశ్రమలపై పరిశోధనలు , వీటితోపాటు పాడిపరిశ్రమ, కోళ్ళ పరిశ్రమను నెలకొల్పి వాటి ద్వారా వచ్చే ఆదాయమార్గాలను అందిస్తూ నిత్య కల్యాణం, పచ్చతోరణంగా విలసిల్లింది.



డెంగీ డేంజర్ జోన్‌లో గుంటూరు

కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం వెల్లడి

- గత ఏడాది 334 ... ఈ ఏడాది 424 కేసులు
- డయేరియా పై ఫోకస్
- ఉమ్మడి జిల్లాలో క్లోరినేషన్ బాగా లేదు
- క్యాన్సర్ స్క్రీనింగ్ లో పల్నాడు వెనుక బాటు
- గర్భిణుల రక్త హీనత కూడా పల్నాడులోనే ఎక్కువ

గుంటూరు సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం వెల్లడించిన ఉమ్మడి గుంటూరు జిల్లా ఆరోగ్య శాఖ నివేదిక లో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. డెంగీ జ్వరం కేసుల్లో గుంటూరు డేంజర్ జోన్ లో ఉంది. గత ఏడాది ఈ జిల్లాలో 334 డెంగ్యూ కేసు లు నమోదు కాగా,ఈ ఏడాది 424 కేసులు నమోదు కావటం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. చికెన్ గున్యా కేసులు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో నే నమోదు కావటం ప్రభుత్వం నివారణ చర్యలకు ఆదేశించింది. పల్నాడు, గుంటూరు జిల్లాలో ని హై రిస్క్ ప్రదేశాలను గుర్తించి క్రిమీ, కీటకాల ద్వారా వ్యాప్తి చెందే జ్వరాలను అరికట్టాలని కలెక్టర్ లకు సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో దోమలు రాకుండా ఇనుప మెస్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ప్రబలిన డయేరియా పై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. పల్నాడు జిల్లాలో 10 సార్లు డయేరియా కేసులు వెలుగు చూడగా, 11 గ్రామాలు ప్రభావితం అయినట్లు, 151 మందికి ఆస్పత్రిలో చికిత్స అందించినట్లు వెల్లడించారు. గుంటూరు లో 3 ప్రదేశాలు, బాపట్ల జిల్లాలో ఒక ప్రదేశంలో వాంతులు, విరేచనాలు కేసులు ప్రబలినట్లు ప్రభుత్వ నివేదిక లో పేర్కొన్నారు. ఇక మీదట ఈ వ్యాధి నిరోధక చర్యల్లో భాగంగా మురుగు కాల్వల్లో ఉన్న మంచి నీటి పైపు లైన్లను సత్వరమే మార్చాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం చేస్తున్న క్లోరినేషన్ బాగాలేదని ప్రభుత్వం ఆక్షేపించింది.బ్లీచింగ్ అందుబాటులో ఉంచటం తోపాటు, ఓవర్ హెడ్‌ట్యాంక్‌లు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. పల్నాడు జిల్లాలో జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పై ప్రభుత్వ నివేదిక లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన వారు 16.48 లక్షల మంది ఉండగా, ఇప్పటి వరకు కేవలం 48 వేల మందికి మాత్రమే పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలో తో పోల్స్తే ఈ జిల్లాలో అతి తక్కువ గా 2.94 శాతం మాత్రమే క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారని వెల్లడించారు. ఇదే జిల్లాలో 12829 మంది గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించగా, 6065 మందిలో రక్త హీనత ఉన్నట్లు తేలింది. కిషోర బాలికలకు తరచూ రక్త పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన కేసుల్లో ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్‌లు ఇవ్వాలని ఆదేశించారు. గుంటూరు జిల్లాలో శిశు మరణాల రేటు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పట్టణ పేదలకు ఇళ్లు ఇవ్వాలి

(5వ పేజీ తరువాయి..)

భూసేకరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది.

మరిన్ని అన్నక్యాంటీన్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో మరో 5 అన్న క్యాంటీన్లకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 15 అన్న క్యాంటీన్లు ఉండగా మరో 2 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బాపట్ల జిల్లాలో ప్రస్తుతం 4 క్యాంటీన్లు ఉండగా, మరో రెండింటికి అవకాశం కల్పించింది. పల్నాడు జిల్లాలో ప్రస్తుతం ఉన్న 10కి తోడుగా మరో క్యాంటీన్‌ను ఏర్పాటు చేయనుంది.

రహదారులకు చికిత్స

పట్టణ ప్రాంతాల్లో రహదారుల మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గుంటూరు జిల్లాలో 2,750 మరమ్మతు పనులు చేపట్టగా వాటిలో 1,954 పనులుపూర్తయ్యాయి. జిల్లాలో ఇప్పటి వరకూ 71.1 శాతం పనులు పూర్తవగా, మరో 796 పనులు పురోగతిలో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో 558 పనులు చేపట్టగా 355 పనులు పూర్తయ్యాయి. 63.6 శాతం పనులు పూర్తవగా ఇంకా 203 చోట్ల జరుగుతున్నాయి. బాపట్ల జిల్లాలో 119 పనులు చేపట్టగా, 46 పూర్తయ్యాయి. 73 చోట్ల పనులు జరుగుతున్నాయి.

ఇసుక సులభంగా అందాలి

(5వ పేజీ తరువాయి..)

మైనింగ్ శాఖ ఆదేశించింది. పట్టా భూముల్లో ఇసుక మేటల తొలగింపు కోసం గుంటూరులో 44 దరఖాస్తులు రాగా అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. బాపట్లలో నాలుగు, పల్నాడులో ఒకటి వచ్చాయి. గుంటూరులో కనీసం జాయింట్ ఇన్‌స్పెక్షన్ కూడా నిర్వహించలేదు. బాపట్లలో జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లు నిర్వహించారు అయితే ఇంకా డీఎల్‌ఎస్‌సీ ఆమోదం లభించలేదు. పల్నాడులో ఒక దరఖాస్తు రాగా దీనికి కూడా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయలేదు. ఈ నేపథ్యంలో తక్షణమే మూడు జిల్లాల కలెక్టర్లు పట్టాభూముల దరఖాస్తులపై దృష్టి పెట్టి పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇసుక వినియోగదారుల నుంచి నిత్యం ఐవీఆర్‌ఎస్ ద్వారా తీసుకుంటున్న అభిప్రాయాలను కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇప్పటివరకు 86 శాతం సంతృప్తి వ్యక్తపరిచారు. ఇసుక ధర విషయంలో 10 శాతం, క్వాలిటీలో ఐదు శాతం, మోతాదులో మరో 6 శాతం మంది అసంతృప్తిగా ఉన్నారు. ఐవీఆర్‌ఎస్ డేటాని నిరంతరం పర్యవేక్షించాలి. ఇసుక ధర అందుబాటులో ఉండేలా చూడాలి. సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల నుంచి గరిష్ఠంగా ఇసుక సరఫరా జరిగేలా చూడాలి. రవాణా చార్జీలను పెంచకుండా నిరంతరం పర్యవేక్షించాలి. గుంటూరులో మెట్రిక్ టన్నుకు రూ.520, పల్నాడులో రూ.780 ధర ప్రస్తుతం ఉంది. ఇంకా కొంత తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరులో నాన్ వర్కింగ్ లీజులు 61, పల్నాడు జిల్లాలో 120, బాపట్లలో 30 ఉన్నాయి. వీటిని ఆపరేషన్‌లోకి తీసుకువచ్చేందుకు కలెక్టర్లు దృష్టి పెట్టాలని ప్రభుత్వం సూచించింది.

ఫిర్యాదులను సమీక్షించాలి

(5వ పేజీ తరువాయి..)

ఫిర్యాదులు అందాయి. ఇప్పటివరకు 598 మాత్రమే పరిష్కరించారు. దీంతో పరిష్కార శాతం 14.06 శాతంగా నమోదైంది. గుంటూరు జిల్లాలో 62 గ్రామసభల్లో 3036 ఫిర్యాదులు రాగా 352(11.59) శాతం మాత్రమే పరిష్కరించారు. మూడు జిల్లాల కలెక్టర్లు వీటిపై దృష్టి పెట్టాలని సూచించింది. రీసర్వే జరిగిన గ్రామాల్లో హద్దురాళ్లపై ఉన్న రంగులు, బొమ్మలు తొలగించాలని ఆదేశించింది. అలానే రీసర్వేని కొనసాగించేందుకు వీలుగా యాక్షన్‌ప్లాన్ తయారు చేసి నివేదించాలని ప్రభుత్వం సూచించింది.

నరసరావుపేట మార్గంలో శబరిమల రైళ్లు

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శబరిమల ప్రత్యేక రైళ్లలో కొన్నింటిని నరసరావుపేట మార్గంలో నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. నంబరు. 07177 విజయవాడ - కొల్లం రైలు ఈ నెల 14,21,28 తేదీల్లో(శనివారం) రాత్రి 10.15కి బయలుదేరి గుంటూరు, నరసరావుపేట, దొనకొండ మీదగా సోమవారం వేకువజామున 6.20కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07178 కొల్లం - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈనెల 16, 23, 30 తేదీల్లో(సోమవారం) ఉదయం 10.45కి బయలుదేరి నరస రావుపేట, గుంటూరు మీదగా మంగళవారం రాత్రి 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07179 కాకినాడటౌన్-కొల్లం రైలు జనవరి 1,8 తేదీల్లో(బుధవారం) రాత్రి 11.50కి బయలుదేరి న్యూగుంటూరు మీదగా శుక్రవారం వేకువజామున 5.30కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07180 కొల్లం - గుంటూరు రైలు జనవరి 3,10 తేదీల్లో(శుక్రవారం) ఉదయం 8.40కి బయలుదేరి శనివారం తెనాలి మీదగా శనివారం ఉదయం 11.30కి గుంటూరు చేరుకొంటుంది. నంబరు. 07181 గుంటూరు - కొల్లం రైలు జనవరి 4,11, 18 తేదీల్లో(శనివారం) రాత్రి 11.45కి బయలుదేరి నరసరావుపేట, దొనకొండ మీదగా సోమవారం ఉదయం 6.20కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07182 కొల్లం-కాకినాడటౌన్ రైలు జనవరి 6న (సోమవారం) ఉదయం 10.45కి బయలుదేరి నరసరావుపేట, గుంటూరు మీదగా మంగళవారం రాత్రి 10 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07185 కొల్లం - గుంటూరు రైలు జనవరి 13, 20 తేదీల్లో(సోమవారం) ఉదయం 10.45కి బయలుదేరి నరసరావుపేట మీదగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. నంబరు. 07183 నరసపూర్ - కొల్లం రైలు జనవరి 15, 22 తేదీల్లో(బుధవారం) రాత్రి 9 గంటలకు బయలుదేరి గుంటూరు, నరసరావుపేట మీదగా శుక్రవారం వేకువజామున 5.30కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07184 కొల్లం - నరసపూర్ రైలు జనవరి 17, 24 తేదీల్లో(శుక్రవారం) ఉదయం 8.40కి బయలుదేరి నరసరావుపేట, గుంటూరు మీదగా శనివారం సాయంత్రం 6.30కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07175 సికింద్రాబాద్ - కొల్లం రైలు జనవరి 2,9,16 తేదీల్లో(గురువారం) రాత్రి 8 గంటలకు బయలుదేరి నడికుడి, గుంటూరు మీదగా శుక్రవారం అర్ధరాత్రి దాటాక 1.30కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07176 కొల్లం - సికింద్రాబాద్ రైలు జనవరి 4, 11, 18 తేదీల్లో(శనివారం) వేకువజామున 5 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా ఆదివారం మధ్యాహ్నం 1.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది.

రాజస్థాన్-ఉత్తరాఖండ్ మ్యాచ్ డ్రా

మంగళగిరి సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ అండర్-16 ట్రోఫీలో భాగంగా రాజస్థాన్, ఉత్తరాఖండ్ మధ్య మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 266 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ జట్టు 367 పరుగులకు ఆలౌయింది. ఉత్తరాఖండ్ బ్యాటర్లు అభిమన్యుల 72, అనయ నేగి 71, మయాంక్ ముదిల 63, కుషర్గ 54 పరుగులు చేయగా, రాజస్థాన్ బౌలర్లు మిరాన్ ఖాన్, సుజల్ పర్మార్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ జట్టు 65 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. రాజస్థాన్ బ్యాటర్లు రజత్ భిగేల్ 86, రాహుల్ 81, షిపాన్ ఖాన్ 51 పరుగులు చేశారు. మూడు రోజుల గడువు ముగియడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌తో ఉత్తరాఖండ్ జట్టుకు 3 పాయింట్లు, రాజస్థాన్‌కు ఒక్క పాయింట్ లభించాయి.


రజత్ (86 పరుగులు)


రాహుల్ (81 పరుగులు)

మచ్చలేని మనిషి నరేంద్రకుమార్



- తండ్రి ఆశయాల కోసమే రాజకీయాల్లోకి..
- ముప్పై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఘనతలు
- దుర్మార్గుడి పాలనలో జైలుపాలు
- టీడీపీకి జీవితాన్ని అంకితం చేశారు
- అభినందన సభలో మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ఆశయ సాధన కోసం ఆయన తనయుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ రాజకీయాలకు వచ్చారని, ఆయన నీతి నిజాయితీతో మచ్చలేని రాజకీయ జీవితాన్ని సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గుంటూరులో శుక్రవారం రాత్రి పొన్నూరు ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ నరేంద్ర కుమార్ 30 సంవత్సరాల రాజకీయ ప్రజాప్రస్థానం అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. సభకు రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ యాసిన్ అధ్యక్షత వహించారు. అచ్చెన్నాయుడు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 2019లో దుర్మార్గుడి పరిపాలనలో నరేంద్ర కుమార్ జైలుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. మంచి వ్యక్తిగా.. కల్మషం లేని నాయకుడిగా ఆయన పేరు పొందారు అన్నారు. ఆయన తండ్రి వీరయ్య చౌదరి ఒక లెజెండ్ అని, ఆయన అడుగుజాడల్లోనే నరేంద్ర నడుస్తున్నారన్నారు. టీడీపీకి ఆయన జీవితాన్ని అంకితం చేశారని ఆయన కొనియాడారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ తండ్రి కల నెరవేర్చేందుకు రాజకీయాల్లో ఉంటూనే కోవిడ్ సమయంలో డీవీసీ హాస్పిటల్ ద్వారా ఎన్నో సేవలందించారన్నారు. గుంటూరు ఛానల్ సాధించేందుకు నరేంద్ర కృషి చేశారన్నారు. ఆయన జీవితం తనకు ఆదర్శమన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండటం తెలిసిన గొప్ప వ్యక్తి నరేంద్ర అని అన్నారు. 2004లో ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అక్రమాలపై గళమెత్తారన్నారు. మంచి నాయకుడిగా పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. సంగం డెయిరీ, డీవీసీ ఆస్పత్రిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లారన్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వీరయ్య చౌదరితో తనకు ఎంతో పరిచయం ఉందన్నారు. నరేంద్ర మొదటిగాసారిగా ఎమ్మెల్యే అయినప్పటి నుంచి తామిద్దరం ఎంతో స్నేహపూర్వకంగా ఉన్నామన్నారు. 30 సంవత్సరాల పాటు సుదీర్ఘ రాజకీయాల్లో ఆయనకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్నారన్నారు.


సభకు హాజరైన టీడీపీ శ్రేణులు, ప్రజలు


సభలో ప్రసంగిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో మంత్రులు సత్యప్రసాద్, రవి, ఎమ్మెల్యేలు ప్రవీణ్, శ్రావణ్ కుమార్

తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర కుమార్ జీవితం ఒక పోరాటమని, 2019-24 మధ్య నిరంకుశ ప్రభుత్వ పాలనపై వీరోచిత పోరాటం చేశారన్నారు. నిరంతరం ప్రజలతో ఉంటూ ప్రజా నేతగా ఎదిగారన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ నరేంద్ర కుమార్ ఎమ్మెల్యేగా 30 ఏళ్ల పాటు ప్రతిపక్షంలో, అధికార పక్షంలో ఉంటూ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర కుమార్ తనలాంటి వారందరికీ ఎంతో ఆదర్శమన్నారు. మరో 20 ఏళ్ల పాటు ఆయన రాజకీయాల్లో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సజీల, జనసేన నాయకులు మార్కండేయబాబు, టీడీపీ నాయకులు దాసరి రాజా మాస్టర్, కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, రాజకుమారి, తాళ్ల వెంకటేష్ యాదవ్, డేగల ప్రభాకర్ పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఈ ఏడాదిలో 23 లక్షల పని దినాలు పూర్తి

● ఆస్తుల కల్పనకే ఉపాధిలో పెద్ద పీట
● 'పల్లె పండుగ'లో 167 సీసీ రోడ్లు ● రూ. 9 కోట్లతో గోశాలలనిర్మాణం
● పంట కుంటలకు ప్రాధాన్యం ● డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వీ శంకర్



గుంటూరుసిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ చట్టం కింద ఈ ఏడాది ఇప్పటికే 23 లక్షల పనిదినాలు పూర్తి చేసినట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వీ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మరో ఏడు లక్షల పనిదినాలు రానున్న మూడు నెలల్లో పూర్తి చేసి లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆస్తుల కల్పనకు ఉపాధిహామీలో పెద్దపీట వేస్తుందని వెల్లడించారు. అందులో భాగంగానే పల్లె పండుగ కార్యక్రమంలో జిల్లాలో రూ. 15.35 కోట్ల వ్యయంతో 167 సీసీ రోడ్లు మంజూరు చేశామన్నారు. వాటిలో 145 పనులు ప్రారంభం కాగా, 10 సీసీ రోడ్లు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు కూడా జనవరి నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాకు పెద్ద సంఖ్యలో గోశాలలు మంజూరైనట్లు తెలిపారు. 425 గోశాలల నిర్మాణం లక్ష్యంగా ఉండగా,385 మంజూరు చేశామని, 330 పనులు ప్రారంభించారని తెలిపారు. ఇవి 90 శాతం సబ్సిడీతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రెండు పశువుల ఉన్న గోశాలకు రూ. 1.15 లక్షలు, నాలుగు పశువులు ఉన్న గోశాలకు రూ.1.80 లక్షలు, ఆరు పశువులు ఉన్న గోశాలకు రూ. 2.35 లక్షలు ఇస్తున్నామని తెలిపారు. వ్యవసాయ ఆధారిత రంగానికి పెద్ద పీట వేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో రైతులు ఉపాధిహామీ పథకం కింద పంట కుంటలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. 18 రకాల ఉద్యాన వన పంటలు సాగుకు కూడా ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. జిల్లాలో ఉపాధిహామీ ద్వారా 2 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పోరంబోకు భూముల్లో బ్లాక్ ప్లాంటేషన్ పేరిట మొక్కలు నాటతామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జిల్లాలో 34 లక్షల పనిదినాలు లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు.



అప్పాజోస్యుల సత్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

అప్పాజోస్యుల సాంస్కృతిక సేవలు ఎనలేనివి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా సాంస్కృతిక రంగానికి అప్పాజోస్యుల చేస్తున్న సేవలు ఎనలేనివని డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ ప్రశంసించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై తుమ్మలకళాపీఠం ఆధ్వర్యంలో ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయ ణకు పురస్కార సభ జరిగింది. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య అప్పాజోస్యుల గొప్ప శాస్త్రవేత్త అని, తాను అమెరికాలో ఉన్న రోజుల్లో భారత్ నుంచి తెలుగు కవులను, పండితులను రప్పించి గౌరవించి, సత్కరించేవారని తెలిపారు. పురస్కార గ్రహీత అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ తుమ్మల సీతారామమూర్తి సాహిత్యాన్ని గూర్చి, తుమ్మల సాహిత్య సప్తాహం అంశాలతో పుస్తకంగా తీసుకురావాలని కోరారు. సభలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, నూతలపాటి తిరుపతయ్య, డాక్టర్ వీ నాగరాజ్యలక్ష్మి, ప్రశాంతి, నాగసుశీల, వీ సింగారావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కేఎస్ లక్ష్మణరావు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు పలకాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి

గుంటూరు(విద్య),డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కృష్ణా,గుంటూరు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు తెలిపాలని కోరుతూ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, రాష్ట్ర నాయకులు అక్కినేని వనజకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వారికి వినతిపత్రాలు అందజేశారు. గత 14 సంవత్సరాలుగా శాసన మండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగ,ఉపాధ్యాయ, అంగన్‌వాడీ, మహిళలు, కార్మికుల సమస్యలపై పోరాటం చేశారని,రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.



విద్యార్థినితో కళాశాల ప్రిన్సిపాల్ అనితాదేవి,కార్యదర్శి బ్రహ్మం తదితరులు

సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీలకు టీజేపీఎస్ విద్యార్థిని ఎంపిక

గుంటూరు(విద్య),డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 నుండి 24 వరకు పంజాబ్ రాష్ట్రంలోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్‌మహిళా బాక్సింగ్ పోటీలకు తమ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్ ఆదిత్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అనితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారినిని కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్ , సభ్యులు నాగ సుందరం, కార్యదర్శి కెవి బ్రహ్మం తదితరులు అభినందించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



రోడ్లు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షించాలని నగర కమిషనర్ పులి శ్రీని వాసులు కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక నల్లపాడు, విద్యానగర్, రెడ్డిపాలెం, ఎల్ఆర్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎమినిటి కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పనులను ప్రతి రోజు పరిశీలించాలని, నాణ్యతలో లోపం గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావా లన్నారు. నల్ల పాడు రైల్వే స్టేషన్ రోడ్ కల్వర్ట్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే అభివృద్ధి పనులకు సిద్ధం చేసే అంచనాలను ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించాలన్నారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ మధుసూదన్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు

నగరపాలక సంస్థ నుండి అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలను తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్, వాసవి నగర్ మెయిన్ రోడ్‌లో అనధికార కట్టడాలను పట్టణ ప్రణాళికాధి కారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో, వాసవీనగర్ మెయిన్ రోడ్డులో అనధికార కట్టడాలను పట్టణ ప్రణాళిక అధికారులు పోలీస్ సహకారంతో పూర్తిగా తొలగించారని తెలిపారు. నగరంలో అనధికార కట్టడాలపై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. వాటిని తొలగించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారన్నారు. భవన నిర్మాణదారులు కూడా ప్రభుత్వ నిర్దేశిత చెక్ లిస్టు మేరకు భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేస్తే వేగంగా అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

షాపు లీజుదారులకు నోటీసులు

గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌లో షాపులీజ్‌దారులకు నోటీ సులు జారీ చేశారు. ఇరవైఐదేళ్ల కాలపరిమితి ముగిసిన షాపు లను తక్షణమే ఖాళీ చేయాలని పేర్కొన్నారు. ఈ మార్కెట్ లోని షాపులకు కాలపరిమితి ముగిసి నప్పటికీ వాటినీ ఖాళీ చేయ కుండా కొంతమంది ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా వీరి అభ్యర్థనను పరిశీలించి నిబంధన ప్రకారం వ్యవ హరించాలని సూచించినట్లు తెలిసింది. జీఎంసీ యాక్టు ప్రకారం ఇరవై ఐదేళ్ల కాలపరిమితి పూర్తయిన షాపులు కచ్చితంగా ఖాళీ చేయాలనే నిబంధన ఉంది. దీంతో మొత్తం 15 షాపుల లీజు దారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసు అందుకున్న తక్షణమే షాపులు ఖాళీ చేయాలని, లేకపోతే చట్ట ప్రకారం చర్య తీసుకోవాల్సి ఉంటుందని ఆర్వో , ఆర్ఐ ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.



స్వర్ణాంధ్ర సభకు వెళుతున్న టీడీపీ శ్రేణులు

రాష్ట్ర సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం: టీడీపీ శ్రేణులు

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు అన్నాయి. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం నుంచి విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర విజన్- 2047 కార్యక్రమానికి పార్టీ శ్రేణులు శుక్రవారం తరలి వెళ్లాయి. బస్సుల్లో, కారులో, బైకుల్లో ర్యాలీగా వెళ్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పార్టీ ముఖ్యనేతలు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి చేసే నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో జాగర్లమూడి శ్రీనివాస్, కార్పొరేటర్లు పోతురాజు సమత, గొల్ల ప్రభాకర్, వేల్పూరు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తలరాతలు మార్చే స్వర్ణాంధ్ర- 2047

ప్రజల తలరాతలను మార్చేందుకు, భావితరాల భవిష్యత్తును నిర్మించేందుకు స్వర్ణాంధ్ర విజన్- 2047 ఎంతో ఉపయోగపడుతుందని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం జరిగిన స్వర్ణాంధ్ర విజన్- 2047 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం ఇవ్వడమే లక్ష్యమని అన్నారు. నాడు చంద్రన్న ఇచ్చిన విజన్-2020 సంకల్పంలో భాగంగా ప్రతీ ఇంటి నుంచి ఓ ఐటీ ఉద్యోగి తయారయ్యారని అన్నారు. నేడు ప్రవేశ పెట్టిన విజన్-2047లో భాగంగా ఇప్పుడు ప్రతీ ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావడమే ముఖ్య ఉద్దేశమని చెప్పారు.



స్వర్ణాంధ్ర సభలో పాల్గొన్న దేగల ప్రభాకర్

దళితుల మధ్య చిచ్చుపెట్టే వర్గీకరణ, క్రిమిలేయర్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దళితుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నంలో భాగంగా వర్గీకరణ, క్రిమిలేయర్‌లను తెరమీదకు తీసుకువచ్చారని లోక్ తంత్రిక్ జనతాదళ్, రాజకీయ ప్రత్యామ్నాయ భారతీయ పార్టీల మూడవ కూటమి రాష్ట్ర అధ్యక్షుడు ఇంజనీర్ బూరగ రత్నం ఆరోపించారు. స్థానిక లాడ్జి కూడలిలో ఈ నెల 15న జరిగే వర్గీకరణ వ్యతిరేక సభకు సంబంధించిన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇంజనీర్ రత్నం మాట్లాడుతూ ఈ నెల 15న జరిగే సభలో ప్రజలు పాల్గొనాలని కోరారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 301 మందికి రూ. 13.88 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) సీహెచ్ వెంకటేశ్వరరావు, గుంటూరు టౌన్1 ఆపరేషన్ ఈఈ టీ శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆటోనగర్, నవభారత్‌నగర్, ఆర్టీసీ కాలనీల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. 59 మంది అధికారులు, 177 మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5231 సర్వీసులు తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, ఇతర కేటగిరీల్లో, అదనపు లోడ్‌తో వినియోగించ డంపై 301 మందికి రూ.13.88 లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్‌చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360 నంబర్లలో ఫిర్యాదులు చేయాలని కోరారు. ఈ దాడుల్లో డిప్యూటీ ఈఈలు కే రవికుమార్, పీహెచ్ ఖాన్, ఏఈలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, ఆపరేషన్ ఏఈ వీ బాజీ ఉన్నారు.

20న నగరపాలక సంస్థ సాధారణ సమావేశం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ సమావేశాన్ని ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్ శుక్రవారం తెలి పారు. నగర మేయర్ మనోహర్ నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్లకు, కోఆప్షన్ సభ్యులకు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్ (గుంటూరు తూర్పు), గల్లా మాధవి(గుంటూరు పశ్చిమ), బీరామాంజ నేయులు(ప్రత్తిపాడు)కు కూడా ఆహ్వాన పత్రాలు పంపినటు తెలిపారు.

నేడు ఎస్టీయు ఆధ్వర్యంలో విద్యా సదస్సు

గుంటూరు(విద్య),డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యా సదస్సు గుంటూరు జిల్లా శాఖ 78వ వార్షికోత్సవ సమావేశం శనివారం నిర్వహించనున్నారు. పొన్నూరు పట్టణ సమీపం చింతలపూడిలోని మువ్వా గార్డెన్స్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీ పెదబాబు, డీకే సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు, సీపీఎస్ రద్దు, జీవో 117 రద్దు, పీఆర్సీ కమిటీ, ఐఆర్ , సరెండర్ లీవు, పిఎఫ్ బకాయిలు , పెన్షనర్ల సమస్యలపై చర్చ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విజయవంతంగా జాబ్‌మేళాలు

గుంటూరు(విద్య),డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): .ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళాలు నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తెనాలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్‌లో జాబ్ మేళాలు నిర్వహించినట్లు తెలిపారు. నల్లపాడులో నిర్వహించిన జాబ్‌మేళాకు 35 మంది నిరుద్యోగులు హాజరు కాగా, అందులో 30 మంది ఏంపికైనట్లు తెలిపారు. తెనా లిలో 37 మంది హాజరు కాగా 24 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి వీసీహెచ్ ప్రసన్న కుమార్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పీఈశ్వరరావు, యంగ్ ప్రొఫెషినల్ మల్లీశ్వరి, ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల హెచ్ఓడీ రాఘవరావు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ సెంటర్ ఇన్‌చార్జి ఈఎస్ శ్యాంబాబు, కోఆర్డినేటర్ డి.రాజా, బీ రవికుమార్ పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ

● రేపు భారీ అన్న సంతర్పణ కార్యక్రమం

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో లాలాపేట ఏలూరుబజారులో శనివారం సాయంత్రం అయ్యప్పస్వామి నవదశ (19వ) మహా పడి పూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధె నాగవెంకటమల్లేశ్వరరావు, తడికమళ్ల మణికంఠ తెలిపారు. ఏలూరుబజారులో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 9.47 గంటలకు అష్టాద్రవ్య మహాగణపతి హోమం శ్రీ శంకరమంచి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలానే స్వామి వారికి పద్మనాభన్ నంబూద్రి గురుస్వామిచే 18 రకాల ద్రవ్యాలు, నదీ జలాలతో స్వామివారికి మహా అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేరళ సంప్రదాయంలో 18 రకాల పూలతో మహా పడి పూజా మహోత్సవం, డప్పు శ్రీను బృందంతో అయ్యప్ప స్వామి పాటలు కోలాహలంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు.

15న సోమేపల్లి సాహితీ సౌరభం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, కాటన్ అసోసియేషన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న 'సోమేపల్లి సాహితీ సౌరభం' పేరుతో సాహిత్య కదంబం నిర్వహిస్తున్నట్టు ఆహ్వాన సంఘం నాయకులు చలపాక ప్రకాష్, ఎస్ఎం సుభాని, సోమేపల్లి వశిష్ఠ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య స్మారక సంచిక ఆవిష్కరణ, సాహిత్య సదస్సు, రాత స్మరణీయులు పుస్తకావిష్కరణ జరుగుతుందని తెలిపారు.

రియల్టర్ కిడ్నాప్.. హత్యాయత్నం కేసులో వైసీపీ నేతల అరెస్టు

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసి కొండపై నుంచి కిందకు నెట్టేసిన కేసులో ముగ్గురు నిందితులను నల్లపాడు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నల్లపాడుకు చెందిన దుగ్గెంపూడి నాగశివారెడ్డి అలియాస్ లెనిన్‌రెడ్డి, కోటేశ్వరరావు, పాతగుంటూరుకు చెందిన అచ్చిరెడ్డిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. నల్లపాడుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇమిడాబత్తిని నాగేశ్వరరావును డబ్బుల కోసం నాగ శివారెడ్డితో పాటు మిగిలిన ఇరువురు కలసి కారులో కిడ్నాప్ చేశారు. తనకు రెండు కోట్లు డబ్బు ఇవ్వాలని నాగేశ్వరరావును డిమాండ్ చేశారు.. తన వద్ద డబ్బులేదని నాగేశ్వరరావు చెప్పడంతో మద్యం సేవించి ఉన్న నిందితులు, ఆయనను గ్రామం పక్కనే ఉన్న కైలాసగిరి కొండ మీదకు తీసుకెళ్లారు. మరోసారి డబ్బు కోసం డిమాండ్ చేయగా ఆయన లేదని చెప్పడంతో టవల్‌తో నాగేశ్వరరావు రెండు చేతులు వెనక్కి విరిచి కట్టేసి, కొండపై నుంచి కిందకు నెట్టేశారు. సుమారు 400 అడుగుల ఎత్తులో నుంచి కిందకు జారి పడిపోయాడు. ఈ ఘటనలో నాగేశ్వరరావు గాయాలతో బయటపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, కోర్టులో హాజరు పరిచారు.

అదుపులో హత్య కేసు నిందితుడు

పరారీలో మరో ఇద్దరు

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌పురం శివారు భవానీపురంలో జరిగిన మస్తాన్ షరీఫ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు గోపిని నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో షరీఫ్ షాపులో పని చేసే సుభానితో పాటు మరొకరు నిందితుడిగా ఉన్నట్లు విచారణలో తేలింది. నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్ షరీఫ్ లాలాపేటలోని బోసుబొమ్మ సెంటర్‌లో మొబీనా మెటల్ స్టోర్ అనే దుకాణం నిర్వహిస్తున్నాడు. తన తండ్రితో కలసి వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు 2016లో వివాహం కాగా, భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా 2020లో వారు విడిపోయారు. ఇదిలాఉంటే గతంలో వీరి షాపులో ఆర్ అగ్రహారం ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొంత కాలం పని చేసింది. ఆమెతో మస్తాన్ షరీఫ్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ తరువాత కొంత కాలానికి ఆమెను పని నుంచి తీసివేశారు. అయినప్పటికీ వారి మధ్య సంబంధం కొనసాగుతూనే ఉంది. ఆమెకు భర్త లేకపోవడంతో ఇతను నేరుగా ఆమె ఇంటికి వెళుతూ ఉండేవాడు. మద్యం సేవిస్తూ అక్కడే ఎక్కువ సమయం గడిపేవాడు. అయితే, షరీఫ్ తన తల్లితో సంబంధం కొనసాగించడం ఆమె కుమారుడుకి ఇష్టం లేదు. ఈ విష యమై ఆమె కుమారుడు అభ్యంతరం వ్యక్తం చేసేవాడు. అయినప్పటికీ షరీఫ్ ప్రవర్తనలో మార్పు రాలేదు. దీనికి ఆగ్రహించిన గోపి, సంగడిగుంటకు చెందిన తన స్నేహితుడు సుభాని, మరొకరితో కలిసి ఈ నెల 10న షరీఫ్‌ను భవానీపురం వైపునకు తీసుకువెళ్లారు. అతనికి మద్యం తాగించి హత్య చేశారు. ఈ కేసులో గోపీని పోలీసులు అదుపులోకి తీసు కుని విచారిస్తున్నారు. మిగిలిన ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పోలీసుల అదుపులో వాహనాల చోరీ నిందితుడు

ద్విచక్ర వాహనాలు, ఆటోలు అపహరిస్తున్న నిందితుడిని కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 10 ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నిందితుడిపై పలు స్టేషన్‌లలో వాహనాల చోరీకి సంబంధించిన పాత కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అరాచకానికి పాల్పడ్డ వైసీపీ ఉన్మాది అరెస్టు

● ఓ మహిళను బెదిరించి లొంగదీసుకుని బ్లాక్ మెయిల్



నిందితుడు నాగేశ్వరరావు (ఫైల్)

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళను బెదిరించి అరాచకానికి పాల్పడ్డ వైసీపీ ఉన్మాది దేవరకొండ నాగేశ్వరరావును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ మండలం వెంగళాయపాలెంకి చెందిన వైసీపీ నాయకుడు నాగేశ్వరరావు నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకలూరిపేట రోడ్డులో ఓ దుకాణంలో తన అనుచరుల చేత దొంగతనాలు చేయించి ఆయా కేసుల్లో దొంగలను తాను పట్టిస్తానని, తాను వైసీపీ నాయకుడినని చెప్పుకుని షాపు నిర్వాహకురాలిని లోబరుచుకున్నాడు. ఆమెను బెదిరించి, నగ్నంగా ఫొటోలు, వీడియోలు తీసి వాటిని బయట పెడతానని బెదిరించేవాడు. ఆమె నుంచి రోజుకు నాలుగు వేల రూపాయలు చొప్పున వసూలు చేసేవాడు. అంతేగాక పలుమార్లు ఆమెపై, ఆమె భర్తపై హత్యా యత్నాలు చేశాడు. ఆమెతో భర్తను చంపించేందుకు కూడా యత్నించాడు. అతని చిత్రహింసలు తట్టుకోలేని బాధితురాలు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. ఆయన ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్‌లోనూ, నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లోనూ కేసులు నమోదయ్యాయి. కేసులు నమోదు చేసి వారాలు గడుస్తున్నప్పటికీ నిందితుడిని అరెస్టు చేయకపోవ డంతో బాధితులు పలు దఫాలు పోలీస్ కార్యాలయాన్ని ఆశ్రయించినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మీడియా సమావేశం ఏర్పాటు చేసి తమ గోడు వెళ్ల బోసుకున్నారు. ఈ పరిణామలన్నింటి నేపథ్యంలో ఎట్టకేలకు మహిళా పోలీస్‌స్టేషన్ అధికారులు శుక్రవారం నిందితుడు నాగేశ్వరరావును అరెస్టు చేశారు. ఈ కేసు నేపథ్యంలో అనేక ట్విస్టులు చోటు చేసుకున్నాయి పోలీసులు వాటి అన్నింటిని చేదించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో నిందితుడిని పోలీస్ కస్టడీకి తీసుకోనున్నట్లు మహిళా స్టేషన్ సీఐ నారాయణ తెలిపారు. ముఖ్యంగా తన భర్తను చంపించడం కోసం నిందితుడు నాగేశ్వరావు ఓ బిచ్చగాడికి సైనేడ్ ఇచ్చి హత్య చేసినట్లు బాధిత మహిళ ఆరో పించింది. అంతేగాక పలు దఫాలు తన భర్తపై హత్యాయత్నానికి పాల్పడినట్లు కూడా పేర్కొంది. తనకు సంబంధించిన అనేక ఫోటోలు, వీడియోలు తీసినట్లు వెల్లడించింది. బాధిత మహిళ ఆరోపణల నేపథ్యంలో నిందితుడిని లోతుగా విచారించాల్సి ఉందని పోలీస్ అధికారులు తెలిపారు. నిందితుడి సెల్‌ఫోన్‌లో డేటాను కూడా రికవరీ చేయాలని పోలీస్ అధికారులు భావిస్తున్నారు. ఆయా ఘటనలు అన్నింటి పైనా కేసులు నమోదు చేయాల్సి ఉందని కూడా పోలీసులు అంటున్నారు. ఈ నేపథ్యంలో నిందితుడితో పాటు ఆయన అనుచరులను కూడా అరెస్టు చేయాల్సి ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండ, డిసెంబరు 13: మండల పరిధి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్. నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయటం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి

ఆర్థిక సాయం

తాడికొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాడికొండ శివారు బడేపురం గ్రామంలో కొద్ది రోజుల క్రితం మరణించిన ఆవుల కోటేశ్వరరావు భార్య సెంచమ్మ కుటుంబానికి సెయింట్ పాల్స్ సొసైటీ అధ్యక్షుడు బెజ్జం సాయిప్రసాద్ రూ. 10 వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డుమెంబర్ కాలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాలకు

నేడు ఎన్నికలు

వట్టిచెరుకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల పోలింగ్ శని వారం జరగనున్న నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 8:30 గంటల నుంచి అభ్యర్థుల నామినేషన్‌ల స్వీకరణ, పరిశీలన అనంతరం ఉదయం 10:30 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానున్నది. పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద వట్టిచెరుకూరు సీఐ రమా నాయక్ పర్యవేక్షణలో ఎస్ఐ సుబ్బారావు, ఇతర సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించనున్నారు. సాయంత్రం 3 గంట లకు ఎన్నికైన టీసీ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అంద జేసిన అనంతరం ఆయా నీటి సంఘాల అధ్యక్షులను ఎన్నుకోనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

బంగ్లాదేశ్‌లో హిందువుల

అరెస్టులను ఖండించండి

తాడికొండ, డిసెంబరు 13: బంగ్లాదేశ్‌లోని హిందువుల అరెస్టులను భారత పౌర సమాజం తీవ్రంగా ఖండించాలని బీజేపీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో అరెస్టు చేసిన హిందువులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లా దేశ్ సెక్యూలర్ రాజ్యాంగంలో ఉన్నప్పటికి ఒకమతం ప్రజలపై దాడులు చేయటం అప్రజాస్వామికమన్నారు. బంగ్లాదేశ్‌లోని హిందువులకు భారతదేశం అండగా ఉంటుందన్నారు. హిందువులకు మద్దతుగా మాట్లాడిన ఇస్కాన్ సంస్థ ప్రతినిధి చిన్మయ్య అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే గల్లా మాధవి

వ్యాఖ్యలు అర్ధ రహితం

ఫిరంగిపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మీద భగవద్గీత పుస్తకాల అమ్మకంపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి వ్యాఖ్యలను హిందూ సంఘాల తరుపున ఖండిస్తున్నామని గుంటూరు బీజేపీ ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఫిరంగిపురంలో మండల బీజేజీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భగవద్గీత విజ్ఞాన బాండాగారమని, సమాజ హితం కోసం ఇస్కాన్‌కు చెందిన సభ్యులు ఆ కార్యక్రమాలు చేస్తుంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు విశ్వనాధుని హరిబాబు, జిల్లా కమిటీ మెంబరు గొర్రెపాటి చంద్రశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఫిరంగిపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామాన రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని తహసీల్దారు జే ప్రసాదరావు అన్నారు. శుక్రవారం మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు మొత్తం 45 అర్జీలను రైతులు ఇచ్చారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ తడవర్తి కేశవరావు, దేవాదాయ శాఖ ఈవో జే శ్రీనివాసరావు, రిజిస్ట్రేషన్ శాఖ జేఏ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ జీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ షేక్ అబ్దుల్ రెహ్మాన్, వీఆర్వో శివ నాగరాజు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు

1902 క్యూసెక్కులు..

దుగ్గిరాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 210 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 82 క్యూసెక్కులనీరు, పశ్చిమకాల్వకు 51 క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 139 క్యూసెక్కులనీరు, కొమ్మమూరుకాల్వకు 975 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

దుగ్గిరాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం దుగ్గిరాలలోని కొత్తలాకు సమీపంలో కొలువై యున్న 42 అడుగుల ఎత్తున ప్రతిష్ఠించబడిన అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమత్ వత్రాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. మార్గశివర మాసం త్రయోదశిని పురస్కరించుకుని నిర్వహించిన హనుమత్‌వ్రతంలో 15 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో జరిగిన వ్రతాన్ని తిలకించేందుకు గ్రామంలోని, సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించగా, నిర్వాహకుడు జూటూరి శ్రీనివాసరావు ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రారంభించాలి


సమావేశంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

మంగళగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ప్రజారోగ్యవేదిక, వందపడకల ఆస్పత్రి సాధన కమిటీ ప్రతినిధులు కోరారు. స్థానిక ఎస్ఎల్ఎం చైతన్య హైస్కూల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్ సమావేశ వివరాలను వెల్లడించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు కేటాయించిన రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు తెలియజేశారు. ప్రజలు తమ ఆదాయంలో 70 శాతం వైద్యం కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ఈ పరిస్థితుల్లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం జరిగితే ఈ ప్రాంత ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ మాజేటి వంశీకృష్ణ, ఎం నాగేశ్వరరావు, నన్నపనేని నాగేశ్వరరావు, దామర్ల రాజు, దామర్ల నాగమణి, వీవీ ప్రసాద్, ఎం గోవర్ధనరావు, ఎస్ బాలకృష్ణ, చిన్నితిరుపతయ్య, కంచర్ల కాశయ్య, ఎం రవి, యూ.సత్యనారాయణ, రాఘవులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు

సత్వర పరిష్కారం


అధికారులకు అర్జీ అందిస్తున్న రైతు

దుగ్గిరాల, డిసెంబరు13: గ్రామసభల్లో భూ సమస్యలకు సత్వర పరిష్కారం పొందవచ్చని మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య అన్నారు. మండలంలోని ఈమని గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో, దేవాదాయశాఖ, వక్ఫ్ భూముల సమస్యలపై రైతుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. సాయిచైతన్య మాట్లాడుతూ, అన్ని రకాల భూ సమస్యలకూ, ఒకేవేదికపై పరిష్కారం అందించేందుకే రాష్ట్రప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. సర్పంచ్ ఉజ్వలహరిణి మాట్లాడుతూ ఈ సభల ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకాల్లో సర్వే నెంబర్లు, అడంగల్‌లో మార్పులు, చేర్పులు వంటివి చేసుకోవచ్చని అన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యలకు సంబంధించి 70 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గేరా నిర్మల, ఆర్ఐ త్రివేణి, వీఆర్వో ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సమతావాణి

తాడికొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఎంపీడీవో సమతావాణి అన్నారు. శుక్రవారం తాడికొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'కిషోరి వికాసం' మండల స్థాయి శిక్షకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో లింగ వివక్ష, సంపూర్ణ ఆహారం ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాలకు అరికట్టుల, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, నైపుణ్యం ఉపాధి అంశాలపై అవగాహన పొంది గ్రామాల్లో కిషోరి బాలికలకు, తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఫిరంగిపురం ఐసీడీ ఎస్ సీడీపీవో ప్రసూన మాట్లాడుతూ బాలలపై జరుగుతున్న శారీరక, మానసిక, లైంగిక హింస వేధింపులు, విపక్ష అరికట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో తెనాలి ఇందిరా, ప్రొటెక్షన్ ఆఫీసర్ దుర్గభవాని, ఈవోపీఆర్‌డీ కే.సాయిలీల చైల్డ్ రైట్స్ అడ్వోకేసి ఫౌండేషన్ క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జీ.వెంకట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ కళావతి, ఎం.శ్రీదేవి, మహిళా పోలీసులు, హెల్త్ వర్కర్స్ అంగన్ వాడీ వర్కర్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మీడియా ప్రతినిధులు

మీడియాపై దాడి హేయం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్‌బాబు టీవీ 5, టీవీ 9 ఇంకా మరికొంత మంది మీడియా ప్రతినిధులపై విచక్షణ కోల్పోయి దాడి కి పాల్పడిన ఘటనను తాడేపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జొన్నా వెంకటేష్ ఖండించారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నులకపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ జర్నలిస్టులపై దాడులు అరికట్టా లని, బాధిత మిత్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సీతారామయ్యకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మీడియా ప్రతిని ధులు జొన్నా వెంకటేష్, జొన్నా రాజేష్, కటికల కమల్, నాగిరెడ్డి, సుబ్రహ్మణ్యం, చినబాబు, రాంబాబు, ప్రదీప్, శ్రీను, శివనాగిరెడ్డి, పాల్గొన్నారు.


వాక్యోపదేశం చేస్తున్న దైవ సేవకులు బర్నబాస్

ఘనంగా చర్చి వార్షికోత్సవం

మంగళగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పార్కురోడ్డు 5వ లైనులోని హోలీ లార్డ్ పెంతెకొస్తు చర్చి 33వ వార్షికోత్సవాన్ని నిడమర్రు రోడ్డులోని అరవింద హైస్కూల్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. దైవ సేవకులు, గుడివాడ గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ రెవరెండ్ బర్నబాస్ సజ్జా పాల్గొని దైవసందేశం అందించారు. గత 33 సంవత్సరాలుగా చర్చి అభివృద్ధికి చేస్తున్న కృషిని సంఘ పాస్టర్ పీ.తిమోతి వివరించారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పాస్టర్ పీ.కొర్నెలి, పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

గ్రామసభకు 44 అర్జీలు

కాకుమాను, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీకే పాలెంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రైతుల వద్ద నుంచి వివిధ సమస్యలపై 44 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు భూ సర్వేకు సంబంధించి 7 అర్జీలు, భూ రికార్డుల్లో నమోదు కోసం 37 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డీటీ, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రియదర్శిని, వీఆర్వో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా

నాణ్యమైన విద్య, ఆహారం

తుళ్లూరు,డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య, సంపూర్ణ మైన ఆహారం, ప్రాథమిక విద్యాభ్యాసం అంగన్‌వాడీల ద్వారా అందించటమే లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీవో ప్రసూన పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, హెల్త్ సిబ్బంది సమావేశంలో ఆమె మాటాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల కేంద్రాల ద్వారా బాలింతలకు, గర్భిణులకు చిన్నారులకు, పౌష్టికాహారం అందిస్తున్నాయని తెలిపారు. మానవ అక్రమ రవాణాను అరికటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తుళ్లూరు పీహెచ్‌సీ డాక్టర్ కే.సుధాకర్, చైల్డ్ రైట్స్ సభ్యులు సీ.హెచ్ ప్రభాకర్, ఆర్.పుణ్యవతి, ఎం.రజాక్, వై.శ్రీలత, సతీరావమ్మ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు

తుళ్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి గ్రామంలో సదస్సులను నిర్వ హిస్తుందని తుళ్లూరు తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డిసెంబరు 6 నుంచి జనవరి 8 వరకు ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. వడ్డమాను గ్రామంలో 100 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పెదపరిమిలో రెండురోజుల పాటు సదస్సును నిర్వహించామన్నారు. సర్వే సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. టీంను ఏర్పాటు చేసి సర్వే చేయించి పరిష్కరిస్తామన్నారు.

దారి కోసం అయ్యన్న వాగు పూడ్చివేత

● పంచాయతీ కార్యదర్శి పరిశీలన

తుళ్లూరు, డిసెంబరు 13: గ్రామ కంఠంలో స్థలాలకు అర్అండ్‌బీ మెయిన్ రోడ్డు నుంచి దారికోసం మండలకేంద్రం తుళ్లూరులో అయ్యన్న వాగునుపూడ్చారు. అర్అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి లోపలకి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులకు స్థలాలున్నాయని వాటికి వాగు పక్కన నుంచే దారి ఉందని పూడ్చారు. దశాబ్దాలనుంచి లేని దారి ఇప్పుడు ఎలా ఉంటుందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇది జరుగుతుందని అందుకే అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు స్థానికులు నుంచి వినిపిస్తున్నాయి. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రమణ పూడ్చిన వాగును పరిశీలించారు. వాగు సర్వే నివేదికను సీఆర్డీఏ అధికారులకు పంపించి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. అంతే కాకుండా పూర్వీకుల స్థలమని వాగు పూడ్చి రేకుల షెడ్డు వేసి కొంత మంది అద్దెలకు ఇచ్చుకున్నారని, వాగు పక్కన ఉన్న స్థలాల వారు పూడ్చుకొని విస్తీర్ణం పెంచుకున్నారని, దీంతో అధిక వర్షాలప్పుడుపై నుంచి వచ్చే వరద నీరు వాగు పూడికలతో సక్రమంగా వెళ్లకపోతే ఊళ్లోనే వరద నీరు నిల్వ ఉండి పోవటం తథ్యమని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగు ఆక్రమణలపై పూర్తి విచారణ చేసితగిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారిణి రమణ తెలిపారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

జిగురు అట్టల ఏర్పాటుతో

ఆకుముడత తెగులు నివారణ

వట్టిచెరుకూరు, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : మిరప తోటల్లో రసంపీల్చే తెల్ల దోమలు ఉధృతి ద్వారా వ్యాపించే ఆకు ముడత తెగుళ్లను పొలంలో జిగురు అట్టల ఏర్పాటు ద్వారా నివారించవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు రైతులకు వివరించారు. గ్రామీణ కృషి అనుభవ అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం వట్టిచెరుకూరు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు శుక్రవారం శాస్త్రవేత్తల అనుభవాలను, సూచనలను రైతులకు వివరించారు. ఆకు ముడతను జెమినీ వైరెస్‌గా పిలుస్తారని, ఈ తెగులు ఉధృతి ద్వారా పంటకు తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. దీని నివారణకు సమగ్ర యాజమాన్యం కింద పసుపు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున ఏర్పాటు చేయాలన్నారు. అలాగే తామర పురుగు నివారణకు నీలంరంగు జిగురు అట్టలు ఏర్పాటుచేయాలని సూచించారు. మండలంలోని లేమల్లెపాడులో ఆ గ్రామ ఏఏవో నాయక్ జిగురు అట్టల ఏర్పాటు గురించి రైతులకు వివరించారు.

గుండెపోటుతో యువకుడి మృతి

దుగ్గిరాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే గానీ డొక్కాడని పేదకుటుంబంలో పుట్టి ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న 27ఏళ్ల యువకుడు గుండెపోటుతో మృతి చెందడంతో దుగ్గిరాలలోని రామ్‌నగర్ విషాదంలోమునిగిపోయింది. శబరిమలకు భక్తులతో మూడ్రోజులక్రితం బస్సు డ్రైవర్‌గా వెళ్లిన రామ్‌నగర్ యువకుడు మోకా శ్రీనివాసరావు తిరుగు ప్రయాణమై తిరుపతి వచ్చాడు. ఉదయం 8గంటల సమయంలో ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు. దుగ్గిరాలకు చెందిన మోకా శ్రీని వాసరావు(27), శబరిమలకు వెళ్లేభక్తుల బస్సుకు హాల్టింగ్ డ్రైవర్‌గా వెళ్లాడు. అయ్యప్ప దర్శనానంతరం తిరుగు ప్రయాణమై, తిరుపతి చేరుకున్నారు. భక్తులు, తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని దర్శించుకునేందుకు వేరే వాహనాల్లో కొండపైకి వెళ్లారు. ఈలోగా బస్సులో వేచియున్న శ్రీనివాసరావుకు బస్సు కండిషన్‌ను పరిశీలించిన అనంతరం ప్రక్కనే కూర్చునే ప్రయత్నం చేస్తూ కుప్పకూలిపోయాడు. కిందపడిపోయిన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం వైద్యశాలకు తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. శ్రీనివాసరావుకు, భార్య, మూడేళ్లలోపు వస్సుగల ఇద్దరు ఆడ పిల్లలున్నారు. స్థానిక టీడీపీ యువ నాయకులు వల్లూరు నరసింహారావు, పాటిబండ్ల సాయికిరణ్, వార్డు సభ్యురాలు పీతా లక్ష్మీ, మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల నగదును మట్టి ఖర్చుల నిమిత్తం అందించారు.


తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్ కుమార్ ఇతర అధికారులు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రత్తిపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐలు కే చంద్రశేఖర్, జీ శివాజిలతో పాటు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పలు దుకాణాలలో రికార్డులు, బిల్‌పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించడంతో పాటు గిడ్డంగిలలో నిల్వలను తనిఖీ చేశారు. మంజునాథ ట్రేడర్స్‌లో 2,02,348 లక్షల విలువ చేసే 11.36 మెట్రిక్ టన్నుల ఎరువులు, పయనీర్ ఆగ్రోస్‌లో 1,96,300 విలువచేసే 11.5 మెట్రిక్ టన్నుల ఎరువులలో వ్యత్యాసాన్ని గుర్తించి వీటిని సీజ్ చేశారు. ఈ మేరకు వీరిపై 6 ఏ కింద కేసులు నమోదు చేసినట్లు ప్రత్తిపాడు ఏవో అరుణ కుమారి తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏవో ఆదినారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ టెస్ట్‌పేపర్స్ పంపిణీ

వట్టిచెరుకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వట్టిచెరుకూరు జడ్పీ హైస్కూల్ ఆడిటోరియంలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ టెస్ట్ పేపర్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉప్పుటూరి చిన రాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతా మహాలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఉప్పుటూరి రామ్‌చౌదరి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని తొమ్మిది జడ్పీ హైస్కూల్స్ హెచ్‌ఎంలకు ఈ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి హెచ్‌ఎం రామారావు అధ్యక్షత వహించగా యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ అధ్యక్షుడు మలినేని హనుమంతరావు హాజరై టెస్ట్‌పేపర్ల తయారీలో తీసుకున్న జాగ్రత్తలను, ఈ పేపర్ల వలన విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు, మండల శాఖ బాధ్యులు ధర్మారెడ్డి, ప్రసాదు, బీ శ్రీనివాసరావు, పరిమి హనుమంతరావులు పాల్గొన్నారు.

మౌనిక మరణంపై

విచారణ చేపట్టాలి

తాడేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన మౌనిక మృతిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం తాడేపల్లి పట్టణ, రూరల్ కమిటిలు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొలనుకొండలో నివాసం ఉంటున్న మౌనిక (30) అనే వివాహిత ఈ నెల 10న అనుమానాస్పదంగా మృతిచెందగా, ఆమె మృతదేహానికి గుట్టుచప్పుడు కాకుండా దహన సంస్కారాలు నిర్వహించడంతో మృతిపై అనుమానాలున్నాయన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఐద్వా పట్టణ రూరల్ అధ్యక్ష కార్యదర్శులు దొంతిరెడ్డి విజయలక్ష్మి, పీ.గిరిజ, కారసాల స్వాతి, కొండపల్లి యశోద ఉన్నారు.

బహిరంగ మద్యపానంపై కేసు

తెనాలి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏడుగురు ఐతానగర్ గోలిడొంకలో మద్యం సేవిస్తున్నారు. వీరిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టామని ఎస్ఐ బాబురావు తెలిపారు.

ఆటోల్లో ప్రయాణం భద్రమేనా...?

- లోకల్ ఆటోలపై దృష్టిసారించని పోలీసులు
- ఇటీవల ఆటో డ్రైవర్ల ముసుగులో దొంగతనాలతో బయటపడిన డొల్లతనం
- ప్రయాణికుల రక్షణపై పలు సందేహాలు
- పోలీసులు దృష్టిసారించకుంటే ప్రయాణికులకు ఇక్కట్లే



తెనాలిలో సీరియల్ నెంబరు లేకుండా తిరుగుతున్న ఆటోలు

తెనాలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బస్సులు, రైళ్ల తరువాత ప్రయాణానికి ఎక్కువగా విని యోగించేవి ఆటోలే. రోజు వేలాదిమంది వివిధ ప్రాంతాలకు ఆటోల ద్వారా ప్రయాణం సాగిస్తుంటారు. తెనాలి పట్టణం నుంచి రూరల్ గ్రామాలకు, ఇతర మండలాలకు వేయి ఆటోలకు పైగా రాకపోకలు సాగి స్తుంటాయి. అయితే అసలు ఈ ఆటోలు నిజంగా ప్రయాణికులను ఎక్కించుకుని గమ్యస్థానాలకు సురక్షి తంగా చేరుస్తున్నారా లేదా అనే విషయాలను పర్యవే క్షించేందుకు ఎవ్వరున్నారు అంటే ఇది ప్రశ్నగానే మిగి లుతుంది. గతంలో స్పీకర్‌గా ఉన్న సమయంలో మనో హర్ ఆటోలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. తెనాలి ప్రాంతంలో ఏ ఏ రూట్‌లకు ఎన్ని ఆటోలు తిరుగుతు న్నాయి. ఆ ఆటోలకు ఓనర్ ఎవరు.. డ్రైవర్ ఎవరు అనే విషయాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. అందులో భాగం గానే స్థానిక పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేక రికార్డులను ఏర్పాటు చేయించారు. వాటిలో ఏ రూట్‌లో ఏ ఆటో తిరుగనుంది, దానికి ఓనర్, డ్రైవర్ వారికి సంబంధిం చిన ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, ఇతర వివరా లను నమోదు చేసుకుని ఆ ఆటోకు ఓ సీరియర్ నెంబ రును ఇచ్చేవారు. ఆటో నడిపే సమయంలో తప్పనిస రిగా యూనిఫాం వేసుకోవాలని ప్రయాణికులకు తగిన గౌరవం ఇచ్చి సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచనలు చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు వాహనాలు నడుపుతుంటే సమాచారం ఇవ్వాలనేవారు. ఆ సమయంలో నేర నియంత్రణ చాలా వరకూ అదుపులో ఉండేది. ఆ తరువాత వైసీపీ పాలన ప్రారంభమైన నాటి నుంచి శాంతిభద్రతలపై పెద్దగా దృష్టిపెట్టకపోవడంతో కొందరు ఆటో డ్రైవర్లు రాత్రుళ్లు ఒంటరిగా వెళ్లే మహిళలను నిర్మానుష ప్రాంతాలకు తీసుకువెళ్లి వారిపై అఘాయిత్యాలకు పాల్పడిన ఘటనలు ఎన్నో వెలుగుచూశాయి. ఇటీవల తెనాలి ప్రాంతంలో ప్రయాణికుల వద్ద విలువైన ఆభర ణాలను దోచుకువెళ్లిన ఘటనలో పలువురు ఆటోడ్రైవ ర్లు పోలీసులకు చిక్కిన ఘటనలు వెలుగుచూశాయి. దీంతో ఆటోలో ప్రయాణానికి ప్రజలు భయభ్రాంతు లకు గురవుతున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. తెనాలి ప్రాంతంలో ఆటోలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. దీనికితోడు వీరిని నియంత్రించేవారు లేకపోవడంతో కొందరు ఆటోవాలాలు యూనిఫాంలు వేసుకోకుండా, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, మద్యం సేవిస్తూ, డీజే సాంగ్స్‌తో వేగంగా వాటిని నడుపుతూ ప్రయాణికులను ఇటు స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తు న్నారు. తెనాలి ప్రాంతంలో ఆటోల నడుపుతూ ప్రయా ణికులను దోచుకున్న దోపిడీ దొంగల ముఠాను 10వ తేదీన ఎస్పీ విలేకరుల సమక్షంలో వివరాలు వెల్లడిం చారు. ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని వారి విలువైన వస్తువులు దోచుకుంటున్న తీరును వెల్లడిం చారు. ఈ సంఘటనతోనైనా ఇక్కడ పోలీస్, ఆర్టీవో అధికారులు అప్రమత్తమవ్వాల్సి ఉంది. ఆటోలపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళితే తప్ప మరో నేరా నికి తావులేకుండా ప్రజలకు భరోసా కల్పించలేరన్నది పలువురి అభిప్రాయం. గతంలో మాదిరిగా తెనాలి ప్రాంతానికి వచ్చివెళ్లే ఆటోల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లలో నమోదు చేసుకొని సీరియల్ నెంబర్లు అందిస్తే నేరాలు తగ్గి ప్రయాణికులకు మేలు జరిగే అవకాశం ఉంది. మరో ఘటన జరగకముందే సంబం ధిత శాఖ అధికారులు వీటిపై దృష్టిపెట్టాలని పలు వురు కోరుతున్నారు.

డ్రెయిన్‌లలో సిల్ట్‌ను పూర్తిగా తొలగించండి

- అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లలోని సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 34వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగిస్తుండగా అందులో వస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు బాటిల్స్‌ను చూసి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. మూడు బుట్టల విధానం అమలు చేయాలని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. అనంతరం పట్టణంలోని 19, 20, 39వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణం లోని 1వ డివిజన్‌లోని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని మున్సిపల్ అసి స్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు ఆకస్మికంగా తనిఖీచేశారు. పారిశుధ్య కార్మికుల మస్టరు రిజిస్టర్‌ను పరిశీలించి 100 శాతం హాజరు ఉండేలా చూడాలన్నారు.

వ్యర్థాలను సక్రమంగా సేకరించండి

- మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా వ్యర్థాలను సక్రమంగా సేకరించాలని పురపాలక సంఘ కమిషనర్ శేషన్న శానిటేషన్ సిబ్బందిని ఆదే శించారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలకు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్తను సేకరించేటప్పుడు హార్టిక ల్చర్ వ్యర్థాలను కూడా సేకరించాలని అన్నారు. ముఖ్యంగా హార్టికల్చర్ వ్యర్థాలను ప్రత్యేక వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. పట్టణంలో వ్యర్థాలను మాత్రం సేకరించి ప్రధాన రహదారులు విజయవాడ, గుంటూరు, వైకుంఠపురం రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను విస్మరిస్తు న్నారని, ఆ చెత్తను కూడా తరలించి రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరువేరుగా సేకరించాలన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రజలు కూడా సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ హెల్త్ అఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో హెలెన్ నిర్మల తదితరులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో దీప్తి

కిషోరి బాలికల సంక్షేమంపై అవగాహన అవసరం

- ఎంపీడీవో దీప్తి

తెనాలి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : కిషోరి బాలికల సంక్షేమంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఎంపీడీవో అత్తోట దీప్తి చెప్పారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వ ర్యంలో మున్సిపల్, రూరల్ మండల గ్రామాల సిబ్బందికి శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. సిడిపివో సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, 11 నుంచి 18 ఏళ్ల వయస్సులో ఉన్న బాలికల వికా సానికి అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సహకారంతో కృషి చేయాలన్నారు. బాలికల విద్య, ఆరోగ్యం, రుతుక్రమం, అక్రమ రవాణా, లైంగిక నేరాల నుంచి రక్షణ, బాల్య వివాహ నిషేధం, బాలహక్కులు, స్వీయరక్షణ, జీవనో పాధి వంటి అంశాల పట్ల రీసోర్స్ పర్సన్స్ అవగాహన కల్పించారు.విజయ్ కుమార్, సౌజన్యశ్రీ, హిమబిందు, నాగమణి, రాజయ్య, సూపర్‌వైజర్లు ప్రసంగించారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రేపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం మండలం దిండిపంచా యతీ అదవలగ్రామంలో నాటుసారా బట్టీలను శుక్రవారం ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ మద్దూరి శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ 400లీటర్ల బెల్లంఊటను, మూడు సారా బట్టీలను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో సిబ్బంది కె.శ్రీనివాస్‌రెడ్డి, మధు సూదన్‌రావు, గోపీకృష్ణ, వాసుదేవ, తది తరులు పాల్గొన్నారు.


జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDY
DNK
30 వసంతాల
రాజకీయ ప్రస్థానం
పొన్నూరు గడ్డపై నాటి ఒక చిన్న అడుగు
పేదవాడి గుండెల్లో ధైర్యమై ప్రత్యర్థుల
గుండెల్లో రణరంగమై... నాటి నుండి
నేటి వరకు తెలుగుదేశం పార్టీ సైనికుడివై
నీతినిజాయితీలతో ప్రజలకు అండగా నిలుస్తూ
ప్రజా జీవితంలో మీరు చేస్తున్న సేవ
30వసంతాలు నిండిన శుభసందర్భముగా..
అసెంబ్లీ టైగర్,
పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు
శ్రీ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గారికి
హృదయపూర్వక జన్మదిన
శుభాకాంక్షలు తెలియజేస్తూ...
మీ తమ్ముడు
కొమ్మారెడ్డి కిరణ్
తెలుగుదేశం పార్టీ నాయకులు, మంగళగిరి

రీ సర్వే పేరుతో మా భూములన్నీ మార్చేశారు

- 1917 నాటి సర్వేతో వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో 2019లో మార్పు
- పిల్లల కాపురాల్లో కలతలు వస్తున్నాయని పలువురి ఆవేదన
- అనారోగ్యంతో ఉన్నా అమ్ముకోలేని పరిస్థితి
- భూ రికార్డుల్లో సరిచేయాలంటూ రైతుల అర్జీలు
- సంగం జాగర్లమూడి రెవెన్యూ గ్రామసభలో 52అర్జీలు



రెవెన్యూ గ్రామ సభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, స్పెషల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్ తదితరులు

తెనాలి రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తరతరాల నుంచి సంక్రమించిన తమ భూములను రీ సర్వేపేరిట గత ప్రభుత్వంలో దేవదాయ భూములంటూ రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో పొందుపరుచుకున్నారని సంగంజాగర్లమూడి రైతులు రెవెన్యూ గ్రామసభలో అధికారుల ముందు వాపోయారు. శుక్రవారం మండలంలోని సంగంజాగర్లమూడి సచివాలయంలో రెవెన్యూ గ్రామ సభను స్పెషల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఇతర రెవెన్యూ అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దాదాపుగా 49మంది రైతులు సభకు హాజరై వారి వద్ద పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి తాలూకు భూమి పత్రాలను, కట్టిన పన్నుల వివరాలను తీసుకువచ్చి అధికారులకు చూపించారు. పలువురు రైతులు 1917 నుంచి తమ పూర్వీకుల నుంచి భూములు వంశపారంపర్యంగా వచ్చాయని వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నా గత ప్రభుత్వం ఎట్లా దేవదాయ భూములుగా మారుస్తారని ప్రశ్నించారు. తరతరాలుగా భూములను తామంతా సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తుంటే అప్పటి నుంచి దేవదాయ శాఖ ఎందుకు అభ్యంతరాలు తెలుపలేదో చెప్పాలన్నారు. మా పూర్వీకులు చనిపోయి సంవత్సరాలు గడుస్తుంటే ఇప్పుడు వచ్చి ఆ భూములు మీవి కాదు దేవదాయశాఖకు చెందినవి అంటుంటే ఎలా అధికారులే చెప్పాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రీ సర్వే ప్రారంభించక ముందు వరకూ తమ భూములు రికార్డుల్లో రైతులవిగానే ఉన్నాయని 2019 తరువాత దేవదాయ భూములంటూ మార్పులు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం కూడా ఆ భూములు తమ ఆధీనంలోనే సాగు చేసుకుంటున్నామని దేవదాయ భూములైతే వందల సంవత్సరాల నుంచి తాము సాగుచేస్తుంటే ఎందుకు ప్రశ్నించలేదని అధికారులను నిలదీశారు. కనీసం వెబ్‌ల్యాండ్‌లో పేర్లు మార్చుచేసుకునే క్రమంలో రైతులకు నోటీసులు కూడా అందించకుండా వెబ్‌ల్యాండ్‌లో పట్టాభూములుగా మార్పుచేస్తారని ఇది రైతులను మోసం చేయడం కాదా అని ఆవేదన వ్యక్తం చేశారు. బిడ్డలకు వివాహం చేసి వారికి భూములను ఇస్తే ఇప్పుడవి ఎండోమెంట్ భూములని వెబ్‌ల్యాండ్‌లో చూపిస్తుంటే కాపురాల్లో మనస్పర్థలు వస్తున్నాయని వాపోయారు. అనారోగ్య సమస్యలతో ఉంటే ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలన్నా తమ భూములు తనఖా పెట్టేందుకు కూడా అవకాశం లేకుండాపోయిందని మనోవేదనకు గురయ్యారు. తమ భూములను తిరిగి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి తమను ఆదుకోవాలని గ్రామసభలో రైతులు అర్జీలు ఇచ్చారు. ఇదిలా ఉండగా దేవదాయశాఖ అధికారులు గ్రామసభకు వచ్చి దేవదాయ భూములను తమకు అప్పగించాలని కోరడంతో రైతులు అవి మీవేనంటూ చెప్పేందుకు మీ వద్ద ఎటువంటి ఆధారాలున్నాయంటూ ప్రశ్నించారు. ఇన్నేళ్లుగా రాని అధికారులు ఇప్పుడేలా వస్తారని నిలదీశారు. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలు చూపిస్తామని మీ వద్ద ఉన్న ఆధారాలు చూపాలని కోరారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

52 అర్జీల్లో 49 దేవదాయ భూములపైనే...

మండలంలోని సంగంజాగర్లమూడిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభకు రైతుల నుంచి 52 అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. వాటిల్లో 49 అర్జీలు తమ భూములను దేవదాయ భూముల వెబ్‌ల్యాండ్‌లో నమోదయ్యాయని ఆ సమస్యను పరిష్కరించి తిరిగి రైతులకు అప్పగించాలని, మిగిలిన 2 సర్వేకి రాగా 1 మ్యుటేషన్‌కు వచ్చాయన్నారు. ప్రతిఅర్జీని పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరిస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు. స్పెషల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



బ్రాహ్మణకోడూరులో జరిగిన గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

పొన్నూరులో 24 అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో 24 అర్జీలు దాఖలయినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. శుక్రవారం బ్రాహ్మణకోడూరులో జరిగిన సభలో మ్యుటేషన్ కోసం 15 అర్జీలు, పాస్ పుస్తకాల కోసం 4, అడంగల్ మార్పుల కోసం 2, డిజిటల్ సిగ్నేచర్ కోసం 1, ఎఫ్‌లైన్ దరఖాస్తులు 2 అందాయి. గ్రామ సభలో రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాలలపై విష ప్రచారం చేస్తున్నారు

- మహాగర్జన పోస్టర్ల ఆవిష్కరణలో అన్నవరపు కిషోర్

తెనాలి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఫలాలను మాలలు అనుభవిస్తున్నారని విషప్రచారం చేస్తున్నారని మాల సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ చెప్పారు. మాలల మహాగర్జన పోస్టర్లను శుక్రవారం ఐతానగర్‌లో ఆవిష్కరించారు. శనివారం సాయంత్రం గుంటూరు సీతారామటౌన్‌షిప్ వద్ద నిర్వహించే మాలల మహాగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చేసిన సూచనలను వర్గీకరించి చూడటం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కమిషన్‌ను వేయడం తగదని, మాల, మాదిగలను వేరు చేయడానికి చేస్తున్న కుట్రలను ఎదుర్కోవాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కి వ్యతిరేకమని, మిశ్రా కమిషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యంగ్రపాటి అశోక్‌కుమార్, బొనిగల ప్రదీప్, బుల్లయ్య, కోటేశ్వరరావు, సునీల్, రవికుమార్, సందీప్, కిరణ్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించాలి

ఎంపీడీవో విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కట్టుగా తమవంతు కృషి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎంపీపీ భీమవరపు పద్మావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపర్చాలన్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పలు అంశాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు.

కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనంద్‌బాబు, పాల్గొన్న కూటమి శ్రేణులు

ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవాలి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

తెనాలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఘన విజయంతో గెలిపించుకోవాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణ మండపంలో తెనాలి, వేమూరు నియోజకవర్గాల పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ కృష్ణ, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యంత మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తొలిగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో అనుహ్యామైన విజయంతో ఆలపాటి విజయం సాధించేలా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి ఓటరును తప్పనిసరిగా కలిసి ఎమ్మెల్సీగా రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుంటే జరిగే మంచిని వివరించి చైతన్యవంతులను చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి కుటుంబమంతా కలిసికట్టుగా ఉంటూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయంతో గెలిపించుకుని చరిత్రలో సరికొత్త రికార్డును సృష్టించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 30వేలకు పైగా తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లో పట్టభద్రులను ఓటర్లుగా చేర్పడం జరిగిందని వారందరితో ఓటు వేయించే బాధ్యత కూడా కూటమి కుటుంబసభ్యులే తీసుకోవాలని కోరారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్సీగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఘన విజయంతో గెలిపించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల పాలనకు మరో మంచి నాయకుడిని జత కట్టేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తొలుత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

కార్యక్రమంలో నన్నపనేని సుధాకర్, పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, మహమ్మద్ ఖుద్దూస్, జొన్నలగడ్డ విజయబాబు, హరిదాసు గౌరీశంకర్, కొలసాని తులసి విష్ణుప్రసాద్, కడియాల కిషోర్, మైలా హరి, తెనాలి, వేమూరు నియోజవర్గాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మోపర్రు పాఠశాల వజ్రోత్సవాలు ప్రారంభం

అమృతలూరు, డిసెంబరు, (ఆంధ్రజ్యోతి) 13: వజ్రోత్సవాలకు మండల పరిధిలోని మోపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్తాబైంది. 1964లో ప్రారంభమైన ఈ పాఠశాల 60ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సంబరాలను పూర్వ విద్యార్థులు ఘనంగా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన 100మంది ఉపాధ్యాయులను సత్కరిస్తారు. పాఠశాల వసతులకు అవసరమైన నిధులు పూర్వ విద్యార్థులతో పాటు ప్రవాస భారతీయులు కూడా ఇస్తూ వస్తున్నారు. మొదటి రోజు జ్యోతి ప్రజ్వలన, విద్యార్థుల పరిచయం, అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రెండో రోజు గతంలో పని చేసిన ఉపాధ్యాయలను సత్కరించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా గణపతి కల్యాణ మహోత్సవం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని 26వ వార్డులోని శ్రీలక్ష్మి గణపతి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత శ్రీ గణపతి స్వామి ఉత్సమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవం జరిపారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

జాబ్‌మేళాలో 111 మంది డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నారై డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాలో 111మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. సీఈవో ఉమామహేశ్వరరావు మేళా వివరాలను విలేకరులకు తెలిపారు. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు టెక్ మహేంద్ర, విప్రో, హెటిరో సంస్థలలో ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు చెప్పారు. విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి లభించేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ లాజరుబాబు, శివన్నారాయణ, కృష్ణారెడ్డి, డీన్ కిషోర్, సాంబశివరావు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

జంపనిలో వైభవంగా హనుమత్ వ్రతం

వేమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపనిలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం హనుమత్ వ్రత వార్షిక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో ఉదయం సుప్రభాత సేవ అనంతరం పండిత దీవి లక్ష్మీనరసింహాచార్యులు విష్వక్సేన ఆరాధన, అజస్ర దీపారాధన, పుణ్యాహవచన నిర్వహించారు. వార్షిక పూజాకర్తలు కంచర్ల ఉమాదేవి, తలశిల గంగాధర్‌రావు, తలశిల ఈశ్వరరావు దంపతులు స్వామివారికి ద్రవ్యాలతో అభిషేకం జరిపించారు. సాయంత్రం చక్రధారి కుటుంబీకులు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి సహస్ర నామ పూజ అనంతరం శ్రీనివాసమూర్తి హనుమద్ వ్రత కథా ప్రవచనం చేశారు. గుంటూరు వెంకట్రావు, ఎనగందల హరిప్రసాద్ దంపతులు ప్రసాద వినియోగం చేశారు. శ్రీవీరాంజనేయ స్వామి భక్తి సమాజం హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు.

భవన నిర్మాణదారుల సమస్యల పరిష్కారానికి ఓపెన్ ఫోరం



ఓపెన్ ఫోరమ్‌ను నిర్వహిస్తున్న మున్సిపల్ ఏసీపీ శ్రీమన్నారాయణ, టీపీవో సాంబశివరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ నిబంధనలకు లోబడి నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో శుక్రవారం మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ ప్రణాళిక సిబ్బందితో కలసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులు ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి ఈ ఫోరంను నిర్వహిస్తున్నామన్నారు. పలువురు భవన యజమానలు, లైసెన్స్‌డు సర్వేయర్లు తాము నూతన నిర్మాణాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయగా అనుమతులు రాలేదని తెలిపారని వారి సమస్యలను ఆన్‌లైన్‌లో పరిశీలించి షార్ట్‌ఫాల్స్ అంటే ఫీజుల చెల్లింపులలో తేడాలను గమనించి వాటి పూర్తి ఫీజులను చెల్లింపజేసి వారి సమస్యలను పరిష్కరించామని తెలిపారు. మరో ఇద్దరు నూతన నిర్మాణాల అనుమతుల కోసం సరైన పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనందున వారి ప్లాన్ అనుమతులను నిరాకరించమన్నారు. వారు మరలా సరైన పత్రాలతో నమోదు చేసుకుంటే నిర్మాణాలకు అనుమతులను ఇస్తామని చెప్పారు. ఈ ఓపెన్ ఫోరం ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని ప్రణాళిక విభాగంలో ఏమైనా సమస్యలుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భవన నిర్మాణ యజమానులను కోరారు. మున్సిపల్ మాస్టర్ ప్లాన్ ప్రకారం భవన నిర్మాణదారులు తమ నూతన భవనాలను నిర్మించుకోవాలని ఏసీపీ కోరారు. కార్యక్రమంలో టీపీవో సాంబశివరావు, పట్టణ ప్రణాళిక సిబ్బంది, స్థల యజమానులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమత్ వ్రత మహోత్సవం

పొన్నూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రత మహోత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. వేకువ జామున స్వామి వారి మూలవిరాట్‌కు, ఉత్సమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. లక్ష తమలపాకుల పూజ నిర్వహించి స్వామి వారికి ప్రీతికరమైన అప్పాలను, వడమాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి ఉత్సమూర్తులను ప్రతిష్ఠించి అర్చక స్వాముల వేదమంత్రాల నడుమ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం కన్నులపండుగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమత్ వ్రతాలను దంపతులతో నిర్వహింపచేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అలాగే సాక్షి భవనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుతీరిన పురాణ ప్రసిద్ది చెందిన దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ వ్రత మహోత్సవం జరిగింది. ఈ పూజల సందర్భంగా ఆలయంలో శాంతి హోమం నిర్వహించారు. పాత పొన్నూరు వీరాంజనేయ స్వామి ఆలయం, నండూరు ప్రపత్తాంజనేయ స్వామి ఆలయం, ములుకుదురు కరవాల వీరాంజనేయ స్వామి ఆలయం, చింతలపూడి అభయాంజనేయ స్వామి ఆలయాలో హనుమత్ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. చేబ్రోలు మండలంలోని శలపాడు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో హనుమత్ వ్రత పూజలు జరిగాయి.




సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్న అర్చక స్వాములు, ప్రత్యేక పూజలందుకున్న వీరాంజనేయస్వామి



కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

తెనాలి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి : తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ప్రాంగణంలో నూతన సంవత్సర కోర్టు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సరం అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. క్యాలెండర్‌లో న్యాయవాదులు, కక్షిదారులకు కావాల్సిన పూర్తి సమాచారం పొందుపరచడం జరిగిందన్నారు. ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, మాజీ అధ్యక్షులు మందలపు వేణుగోపాలరావు, అప్పల కిషోర్, సుధాకర్, జగదీశ్వరాంబ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్



దుస్తులు, సరుకులు అందజేస్తున్న దిలీప్‌రాజా

పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు రూరల్ మండలం పెదరావూరులో నిర్వహించారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ, జీవకోటి పాపాలను సిలువపై ధారపోసి మరణించిన మహనీయుడు ఏసుక్రీస్తు అని చెప్పారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి పేదలకు దుస్తులు, సరుకులు పంపిణీ చేశారు. నరేష్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలను

నిబంధనల ప్రకారం నిర్మించాలి

● మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ

ఫటా ఫట్



తెనాలి, మారీసుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో నూతనంగా భవనాలను నిర్మించేవారు నిబంధనల ప్రకారం నిర్మించాలని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో శ్రీమన్నారాయణ తెలిపిన వివరాలు.

ప్రశ్న: భవన నిర్మాణం చేయాలంటే ఏమి చేయాలి ?

జవాబు: నూతనంగా భవనాలను నిర్మించాలంటే పురపాలక సంఘ మాస్టర్ ప్లాన్‌కు, నిబంధనలకు అనుగుణంగా ఉన్న స్థలాలకు అనుమతులు ఇస్తాం.

ప్రశ్న: ఇంటి ప్లాన్ కోసం ఎలా దరఖాస్తు చేయాలి ?

జవాబు: ఇంటి ప్లాన్ కోసం డీపీఎంఎస్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో లైసెన్స్‌డు సర్వేయర్ ద్వారా తగిన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలి

ప్రశ్న: ఎన్నిరోజులకు ప్లాన్ వస్తుంది, ఎంత ఎత్తు వరకు నిర్మించుకోవచ్చు ?

జవాబు: డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే 15రోజులలో ప్లాన్‌కు అనుమతులు ఇస్తాం పురపాలక సంఘ పరిధిలో 10 మీటర్ల ఎత్తు వరకు అంటే జీ ప్లస్ 2 వరకు అనుమతి ఇస్తాం.

ప్రశ్న: అంత కన్నా ఎత్తు నిర్మించుకోవాలంటే ?

జవాబు: 300 స్కేర్ మీటర్లకు మించితే సీఆర్‌డీఏ పర్మిషన్ తీసుకోవాలి.

ప్రశ్న: అనధికార కట్టడాలను ఎలా క్రమబద్ధీకరిస్తారు?

జవాబు: పురపాలక సంఘం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలు క్రమబద్ధీకరించాలంటే ఆ భవనాలు మాస్టర్ ప్లానుకు అనుగుణంగా ఉంటే ప్రభుత్వ ఫీజుతో పాటు 33 శాతం కాంపౌండ్ ఫీజును వసూలుచేసి రెగ్యులరైజ్ చేస్తాం.

ప్రశ్న: అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు ప్రారంభిస్తే ఎం చేస్తారు?

జవాబు: ఆ భవన నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తాం, పురపాలక సంఘం చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రజలకు భవన నిర్మాణ అనుమతులపై ఏమైనా సమస్యలుంటే ఏంచేయాలి ?

జవాబు: పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో ప్రతి శుక్రవారం ప్రత్యేక డెస్క్‌ను నిర్వహిస్తున్నామని ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.



సాగునీటి ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలి

తహసీల్దార్ సిద్ధార్థ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురంలో వీవోలకు, ఏపీవోలకు సాగునీటి ఎన్నికపై సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్‌ను తీసుకోవాలన్నారు. నీటి సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికల విషయంలో ఎటువంటి పొరపాట్లు జరిగిన తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహించాలన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు అధ్యక్షుడును, ఉపాధ్యక్షుడును ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. అధికారులందరూ ఉదయం 7 గంటలకు పోలింగ్ కేంద్రాలకు హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాధవి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వేదిక సభ్యులు

ఎమ్మెల్యే మాధవి వైఖరిపై నిరసన

● దిష్టిబొమ్మ దహనం

తెనాలి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి వైఖరి నిరసిస్తూ హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గాంధీచౌక్‌లో ఆమె దిష్టిబొమ్మను దహనం చేశారు. భక్తులకు ఇస్కాన్ సంస్థ భగవద్గీత గ్రంథాన్ని విక్రయించకుండా అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన భగవద్గీత గ్రంథ పంపిణీని అడ్డుకోవడం ఏమిటంటూ ప్రశ్నించారు. హిందువు అయి వుండి భారతీయురాలిగా భగవద్గీత విలువ తెలియకుండా వ్యవహరించడం సిగ్గు చేటని, భగవంతుని సేవతో పాటు లక్షలాది మందికి అన్నం పెట్టే ఇస్కాన్ సంస్థ ఆదుకుంటుందన్నారు. హిందువులకు వ్యతిరేకంగా ప్రవర్తించిన మాధవిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొట్టి మూర్తి శ్రీనివాస్, రమాదేవి, హనుమంతరావు, అంబటి మారుతీ వరప్రసాద్, మూర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

శివాజీచౌక్‌లో అన్నదానం

తెనాలి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాళీమాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శివాజీచౌక్‌లో అన్నదానం చేశారు. కమిటీ ఛైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో రెండోవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జరిగిన అన్నదానంలో సీతారామయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





